

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
GSTIN 37AMRPM5719R1ZX

## శ్రీశైలంలో మహాశివరాత్రి సంరంభం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 40 | సోమవారం 09 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3



2లో

## ఏపీకి రూ.40 వేల కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల మేర కేటాయింపులు జరిగాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో కేంద్ర బడ్జెట్‌పై మంత్రి విశ్లేషించారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు రూ.10,134 కోట్లు కేటాయించడంతోపాటు రాష్ట్రం మీదుగా హైస్పీడ్ రైల్వే లైన్ వస్తుందన్నారు. అమరావతి అభివృద్ధికి రూ.1,128.91 కోట్లు, రాజధాని ప్రాంతంలో సమీకృత పట్టాణాభివృద్ధికి రూ.432.09 కోట్లు, గ్రామీణ రహదారులకు రూ.500.99 కోట్లు కేటాయించిందని, ఇంకా మౌలిక వసతుల కల్పనకు కేంద్రం పెద్ద పీట వేసిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320 కోట్లు కేటాయించారని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతీయ రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు 4 వేల ఎలక్ట్రిక్ బస్సులు

# "నామ్ నరేందర్... కామ్ సరెండర్"...

అమెరికాతో ప్రధాని మోదీ ఒప్పందంపై
వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు
ఇది గ్రేట్ డీల్ కాదు, దేశానికి బ్లాక్ డీల్ అని వ్యాఖ్య
అమెరికా బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి దేశ
ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ
సున్నా సుంకాలతో స్వదేశీ పరిశ్రమలకు,
రైతులకు తీవ్ర నష్టమని ఆందోళన
ఒప్పందం పూర్తి వివరాలను వెంటనే
బయటపెట్టాలని డిమాండ్

2లో



## డేటా చోరీపై విచారణ పూర్తి

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో డేటా చోరీ వ్యవహారంపై విచారణ పూర్తయింది. రెండు రోజుల పాటు విచారణ చేసిన త్రిసభ్య కమిటీ.. ట్రస్ట్‌లో పీఎంయూ యూనిట్‌లో ఉన్న ఉద్యోగులందరినీ విచారించింది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ట్రస్ట్‌లో ఉన్న వైద్యుల డేటా మొత్తం బయటికి తీయించి, దానిని ట్రస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగికి సంబంధించిన సాఫ్ట్‌వేర్ కంపెనీకి అప్పగించినట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం. సదరు సాఫ్ట్‌వేర్ కంపెనీ ద్వారానే వైద్యులకు, ఇతర సిబ్బందికి మేసేజ్‌లు వెళ్లినట్లు వెల్లడైంది. త్రిసభ్య కమిటీ సోమ, మంగళవారాల్లో నివేదిక సమర్పించనుండగా, దాని ఆధారంగా డేటా చోరులపై చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ అధికారులు వెల్లడించారు.

2లో



## అమరావతిలో ఏఐ యూనివర్సిటీ

రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలువుదీరబోతోంది. కృత్రిమ మేధ(ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ తాజాగా జీవో జారీ చేసింది. ఏఐ ఎకో సిస్టమ్, మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు వీలుగా కంపెనీల చట్టం 2013 సెక్షన్-8 కింద 'లాభాపేక్ష లేని' కంపెనీగా జీవోలో పేర్కొన్నారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో రాజధానిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ సంస్థ ఎన్విడియా(ఎన్వీఐడీఐఏ) కార్పొరేషన్‌తో ఐటీ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. తక్షణమే కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మెమొరాండమ్ ఆఫ్ అసోసియేషన్, ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ ను జారీచేసింది. ఈనెల 19 నుంచి వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభిస్తుందని సమాచారం. ఈ విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం అమరావతిలో ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తుందని జీవోలో పేర్కొన్నారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, తయారీ, ఫిన్‌టెక్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి ప్రాధాన్య రంగాల్లో ఏఐ వినియోగ మార్గాలను రూపొందించి అమలు చేస్తుందని ప్రభుత్వం తెలిపింది.

# ఒక్క విద్యార్థి.. నలుగురు లెక్చరర్లు..!

2లో

గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల(హైస్కూల్ ప్లస్) మౌలిక వసతులకు దూరంగా... సమస్యల సుడిగుండానికి దగ్గరగా కునారిల్లుతోంది..! ముందు హడావుడిగా మంజూరు చేసి, అరకొర భవనాల్లో ఏర్పాటు చేసిన ఈ కళాశాల వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో తొలి బ్యాచ్ అంటూ ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఈ కాలేజీలో చేరేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతానికి ఒకే ఒక్క విద్యార్థి.. నలుగురు లెక్చరర్లతో నడుస్తోంది.






రేపు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

స్వర్ణాంధ్ర 2047 విజన్, 10 సూత్రాల అమలుపై ప్రధానంగా సమీక్ష

ఆదాయార్జన శాఖలు, కేంద్ర పథకాల పురోగతిపై చర్చ

వర్చువల్ విధానంలో పాల్గొననున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

2026-27 ఆర్థిక సంవత్సర లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం

2లో

## లడ్డు వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

## పాత జిల్లాలు రద్దు.. సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ!

తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరదించారు. రాష్ట్రంలోని ప్రస్తుత జిల్లాలను రద్దు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, కొత్త జిల్లాలను ఏర్పాటు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల సచివాలయంలో డైరీ ఆవిష్కరణ సందర్భంగా, భూపాలపల్లి బహిరంగ సభలో సీఎం ఈ అంశంపై స్పష్టత ఇచ్చారు.

2లో



జగనన్న కాలనీల లెవలింగ్ పనుల్లో అక్రమాలు
అడ్డుకుంటున్న గ్రామీణాభివృద్ధి శాఖ
తనిఖీలతో 'లెక్క' తేలుస్తున్న క్వాలిటీ కంట్రోల్
అక్రమ చెల్లింపులకు చెక్.. రికవరీలు
కోర్టు కేసులు విత్‌డ్రా చేసుకుంటున్న వైనం



## వైసీపీ నేతల అడ్డగోలు బిల్లులకు బ్రేకులు

2లో

# రేపు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# వైసీపీ నేతల అడ్డగోలు బిల్లులకు బ్రేకులు

గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల లెవలింగ్ పనుల్లో అడ్డగోలుగా దోచుకున్నారు. పనులు చేయకపోయినా చేసినట్టు వైసీపీ నేతలు, కార్యకర్తలు బిల్లులు చేసుకున్నారు. ఇంకా పెండింగ్ బిల్లులు ఉండటంతో కూటమి ప్రభుత్వంలో ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు పూర్తిగా పనులు చేయకపోయినా బిల్లుల కోసం ఏకంగా కోర్టును ఆశ్రయించారు. గ్రామీణాభివృద్ధి శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగాలతో తనిఖీలు చేపట్టి పనుల 'లెక్క' తేలుస్తుండటంతో వైసీపీ కార్యకర్తలు తోకముడుస్తున్నారు. కొందరు కేసులు ఉపసంహరించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.1500 కోట్ల మేర పనులు చేపట్టామంటూ రికార్డులు సృష్టించి సుమారు రూ.1150 కోట్ల వరకు జేబులో వేసుకున్నారు. మరో రూ.300 కోట్లకు పైగా బిల్లులు రావాలంటూ కొందరు కోర్టులను కూడా ఆశ్రయించారు. అప్పట్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులు నిషేధమంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలివ్వడంతో మిగిలిన బిల్లులు చెల్లించే బాధ్యతను గృహ నిర్మాణ శాఖకు అప్పగించారు. దీంతో పలువురు వైసీపీ కార్యకర్తలు పెండింగ్ బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో హడావుడి చేసి బిల్లులు వసూలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ అప్రమత్తమైంది. ఆయా పనులను వెంటనే క్వాలిటీ కంట్రోల్ విభాగాలతో తనిఖీలు చేపట్టింది. క్వాలిటీ కంట్రోల్ నిర్ణయించిన మేర కోత విధిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఓ వైసీపీ నేత చేసిన పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసి రూ.1.29 కోట్లు రికవరీ విధించడంతో ఆ నేత హైకోర్టు నుంచి కేసు ఉపసంహరించుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ కోర్టు కేసులకు సంబంధించి యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని అప్రమత్తం చేయడంతో వైసీపీ నేతల ఆటలు సాగడం లేదంటున్నారు. చేయని పనులకు కోర్టు ఆదేశాలతో బిల్లులు పొందే ప్రక్రియకు తెరపడిందని పేర్కొంటున్నారు.

**నాడు అడ్డగోలు దోపిడీ** గత ప్రభుత్వంలో చేపట్టిన లెవలింగ్ పనులపై కూటమి సర్కార్ వచ్చిన తర్వాత అసెంబ్లీలోను, క్షేత్రస్థాయిలోను ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5 శాతం జగనన్న కాలనీల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. చాలా గ్రామాల్లో ఊరిబయట చెరువులు, గుట్టలు, కొండల్లోను లెవలింగ్ పనులు చేసినట్లు మమ అనిపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తుచేయాలని కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆ శాఖకు చెందిన చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని ఆదేశించారు. గత 8 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కోర్టులను ఆశ్రయించినవారి పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు సత్వరమే తనిఖీలు నిర్వహించి కోర్టుకు నివేదికలు సమర్పిస్తున్నారు.

**50 శాతం తనిఖీలు పూర్తి** రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం తనిఖీలు పూర్తయ్యాయి. 9,384 జగనన్న కాలనీల లెవలింగ్ పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ విభాగం తనిఖీలు చేపట్టింది. అందులో 4,336 పనులకు సంబంధించి రికవరీ చేయాలంటూ అధికారులు ఇప్పటికే ఆయా డ్వామా పీడీలకు సూచించారు. ఈ లోపు తమకు బిల్లులు చెల్లించాలంటూ సుమారు 367 పనులకు సంబంధించి 106 మంది వైసీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. కొన్ని మండలాల్లో అయితే 10 శాతం పనులు చేపట్టి నూరుశాతం బిల్లులు పొందే ప్రయత్నాలు చేశారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో 38 జగనన్న కాలనీల్లో లెవలింగ్ పనులు చేపడితే అందులో 37 కాలనీల్లో అసలు నివాసానికే యోగ్యత లేనివి. వీటికి సంబంధించి రూ.2.58 కోట్లు పనులు చేసినట్లు ఎంబుక్‌లు రికార్డు చేయించుకున్నారు. అందులో ఇప్పటికే రూ.1.03 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఇటీవల క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేపట్టడంతో అక్కడ రూ.38.21 లక్షల పని మాత్రమే జరిగిందని నిర్ధారణ అయింది. దీంతో వైసీపీ నేతలకు చెల్లించిన మొత్తంలో రూ.65.34 లక్షలు రికవరీ చేయాలని చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ నెల్లూరు డ్వామా అధికారులను ఆదేశించారు. 12 శాతం పనులు మాత్రమే చేసి నూరు శాతం బిల్లులు కొట్టేయాలని ప్రయత్నించారు.

## శ్రీశైలంలో మహాశివరాత్రి సంరంభం

అష్టాదశ శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆల య అధికారులు, అర్చకులు యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చతుర్వేదపారాయణం, వేదస్వస్తి జరిపించారు. లోకకల్యాణార్థం ఆలయంలో బ్రహ్మోత్సవ శివ సంకల్పాన్ని పఠించారు. రాత్రి 8:30 గంటలకు సకల పరివార దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు దంపతులు, శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, ప్రధానార్చకులు విజయ్, ట్రస్టుబోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర రావు దంపతులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు సోమవారం భృంగివాహన సేవ నిర్వహిస్తారు.

## నాడు బర్రెలతో వెలవెల.. నేడు కార్ల కళకళ




వైసీపీ హయాంలో గొల్లపూడిలో ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ భవనం వద్ద అప్పట్లో నిత్యం గేదెలు సంచరిస్తుండేవి. ఇప్పుడు ఆ ప్రాంతం అధికారులు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వారికి కేటాయించిన కార్లు, సందర్శకుల రాకపోకలతో సందడిగా మారింది. వైసీపీ హయాంలో ఈ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకున్న అప్పటి ప్రభుత్వం.. కేవలం బోర్డు ఏర్పాటు చేసి ఇదే బీసీ సంక్షేమ భవనం అని సరిపెట్టుకుంది. కార్యాలయాల్లో ఫర్నిచర్ పూర్తిగా ఏర్పాటు చేయడం గాని, అక్కడ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు కూర్చోని విధులు నిర్వహించిన దాఖలాలు గానీ లేవు. దీంతో ఖాళీగా ఉన్న బీసీ సంక్షేమ భవనంలో బర్రెలు సంచరిస్తుండటాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా ఫోటోలు ప్రచురించింది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఈ సంక్షేమ భవనంలో జరిగే కార్యక్రమాలకు ఆ శాఖ మంత్రి ఎస్.సవిత, ఉన్నతాధికారులు తరచుగా హాజరవుతున్నారు. దీంతో ఒకప్పుడు బర్రెలు సంచరించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు కార్పొరేషన్ల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, కార్లు, అధికారులతో కళకళలాడుతోంది.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

ఓ మహిళా కానిస్టేబుల్ పోలీసుస్టేషన్‌లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. నెల్లూరు జిల్లా సీతారామపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నల్లిపోగు జ్యోతి ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. సహచర పోలీసులు వెంటనే వింజమూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన జ్యోతి విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి సీఐ వెంకటరావు వేధింపుల వల్లే ఆత్మహత్యకు ప్రయత్నించానని చెప్పారు. మూడేళ్లుగా సీతారామపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. అక్కడ ఎస్ఐగా పని చేస్తున్న శివకృష్ణారెడ్డితో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్లు సీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తన పరువుకు భంగం కలిగేలా అసత్య ప్రచారాలు చేసిన సీఐపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

## 'ఉపాధి' పనుల స్పీడ్‌కు బ్రేకులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిమెంట్‌రోడ్లు తదితర మెటీరియల్ పనులు చేపట్టిన వారికి బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసీ పోర్టల్ బ్రేకులు వేస్తోంది. ఈ పథకం మార్చి నెలాఖరుకు పూర్తవుతుండటంతో మంజూరైన పనులన్నీ ఆ లోపు చేయాలని అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉపాధి మెటీరియల్ నిధులతో రాష్ట్రంలో చేపట్టిన సిమెంట్‌రోడ్లు, తారురోడ్లు, మినీగోకులాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు డ్రైవ్ చేపట్టారు. కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులందరూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పనులను వేగవంతం చేశారు. అయితే ఈ పథకానికి సంబంధించిన లావాదేవీలన్నీ ఎన్ఐసీ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయి. ఈ పోర్టల్‌లో ఎలాంటి సాఫ్ట్‌వేర్ సమస్యలొచ్చినా పనులకు బ్రేకులకు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆఖరులో పనుల వేగం తగ్గించేందుకు సాఫ్ట్‌వేర్‌లో పలు రకాలు అడ్డంకులు సృష్టిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో నడుస్తున్న(ఆన్‌గోయింగ్) పనుల సంఖ్య 20కి మించి ఉండరాదని నిబంధనలు పెట్టింది. దీంతో మెజారిటీ పంచాయతీల్లో కొత్త పనులను ఆన్‌గోయింగ్ వర్క్స్ కిందకు చేర్చుకోలేని పరిసితి ఏర్పడింది. జిల్లాల్లో కలెక్టర్లు మంజూరుచేసిన పనులు సర్పంచులు, వెండర్లు త్వరితగతిన పూర్తి చేసినప్పటికీ వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చెల్లింపులు పొందడంలో వెనకబడతామన్న ఆందోళన పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 34వేల మినీ గోకులాలు మంజూరుచేసి 20 వేలకు పైగా పనులు కూడా ప్రారంభించారు. అయితే, వాటి బిల్లులు అప్‌లోడ్ చేయడంలో సిబ్బందికి పోర్టల్ సహకరించడం లేదు.

**పలు రకాల ఆటంకాలు...** ఎన్ఐసీ పోర్టల్‌లో పలు రకాల ఆటంకాలు ఏర్పడ్డాయి. పథకం ముగింపు సమయంలో రాష్ట్రాల్లో అడ్డగోలుగా బిల్లులు అప్‌లోడ్ చేస్తారేమోనన్న యోచనతో కేంద్రం వెబ్‌సైట్ ద్వారా నియంత్రణ ప్రక్రియ చేపట్టింది. దీంతో గ్రామ పంచాయతీల్లో ఉన్న ఆన్‌గోయింగ్ పనుల సంఖ్యను పోర్టల్ 20కి నియంత్రించింది. అంటే ఆన్‌గోయింగ్ కింద 20 లేదా అంతకంటే తక్కువ సంఖ్యలో మాత్రమే పనులు ఉండాలి. అంతకంటే ఎక్కువ పనులను అనుమతించదు. కొత్త పనులు ఇందులో చేర్చాలంటే ఉన్న పనులను తొలగించాల్సి వస్తోంది. కొన్ని పెద్ద పంచాయతీల్లో అధిక సంఖ్యలో పనులు ప్రారంభమైనందున కొత్త పనులు ఆన్‌గోయింగ్ కిందకు తెచ్చే పరిస్థితి లేదు. పోనీ ఈ పనుల జాబితాను తొలగించాలంటే వాటిలో కనీసం 30 శాతం పూర్తి చేసి ఉండాలి. లేకుంటే పోర్టల్ నుంచి తొలగించేందుకు అనుమతించడం లేదు. గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మినీగోకులాల పనులు పల్లెపండుగ-2 కింద ప్రారంభమయ్యాయి. ఎక్కువ సంఖ్యలో మినీగోకులాలు ఉండటంతో ఈ పనులన్నీ ఆన్‌గోయింగ్ కిందకు పోర్టల్ అనుమతించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**కేంద్రంతో అధికారుల సంప్రదింపులు..** ఈ సమస్యలపై కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సంప్రదిస్తూనే ఉన్నారు. 20 పనుల జాబితాలో రైతుల, ఉద్యానవన పంటల, హౌసింగ్‌కు సంబంధించిన పనులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ తరహా పనులు ఎన్ని ఉన్నా... 20 పనుల లిమిట్ అనే అంశం కిందకు రాదు. అయితే మినీ గోకులాలను మాత్రం ఆ తరహా జాబితాలో చేర్చకపోవడంతో రాష్ట్రంలో పెద్ద సమస్యగా మారింది. పనులు పూర్తిచేసి బిల్లులు చేసుకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మినీ గోకులాలను పోర్టల్‌లో అనుమతించకపోవడంతో తాము నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో ఏర్పడింది. ఉన్నతాధికారులు సత్వరమే కేంద్ర అధికారులతో మాట్లాడి బిల్లులు అప్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# "నామ్ నరేందర్... కామ్ సరెండర్"...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక 'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు. "మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు. అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు. 75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# ఏపీకి రూ.40 వేల కోట్లు

కేటాయించారన్నారు. మునిసిపల్ బాండ్ల ద్వారా రూ.300 కోట్లు వస్తాయని, విశాఖ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు వచ్చే అవకాశముందని తెలిపారు. అరకులో పర్యావరణహితమైన ట్రెకింగ్, పులికాట్ సరస్సు వద్ద పక్షుల పరిశీలన వంటి కార్యక్రమాలతో టూరిజం అభివృద్ధికి కేంద్రంనాంది పలికిందని పెమ్మసాని వెల్లడించారు.

# ఒక్క విద్యార్థి.. నలుగురు లెక్చరర్లు..!

**ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి** ఏలూరు జిల్లా ముసునూరు జడ్పీ పాఠశాలలో గత వైసీపీ ప్రభుత్వం బైపీసీ గ్రూప్‌తో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ నాలుగు సబ్జెక్టులకు నలుగురు లెక్చరర్లను నియమించారు. ప్రారంభంలో ఎనిమిది మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఒక్క విద్యార్థిని (మొదటి సంవత్సరం) మాత్రమే ఉన్నారు. నలుగురు లెక్చరర్లు ఉన్నారు. ప్రతినెలా నలుగురు లెక్చరర్లకు వేతనాల రూపంలో రూ.4లక్షల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ముసునూరు జూనియర్ కళాశాలలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించారు. నివేదికలు అందజేయాలని విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

# పాత జిల్లాలు రద్దు.. సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ!

గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత లేకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే జిల్లాలను, మండలాలను విభజించిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక జిల్లాలో కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఉంటే, మరో జిల్లాలో 14 ఉండటం.. అలాగే జనాభా ప్రాతిపదికన తీవ్ర వ్యత్యాసాలు ఉండటం పరిపాలనకు ఆటంకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల ఉనికిని దెబ్బతీయకుండా, కేవలం ప్రజల సౌకర్యం కోసం సరిహద్దులను సవరించే ప్రక్రియ మాత్రమే చేపడతామని భరోసా ఇచ్చారు. ఏవైనా గ్రామాలు లేదా మండలాలు తమకు జిల్లా కేంద్రం దూరం అవుతోందని భావిస్తే, వారి విజ్ఞప్తి మేరకు మార్పులు చేస్తామన్నారు.

**జుడీషియల్ కమిషన్ ఏర్పాటు** ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించనుంది. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఈ కమిషన్ పని చేస్తుంది. ఇది ఆరు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల నుండి సలహాలు, సూచనలు స్వీకరిస్తుంది. కమిషన్ ఇచ్చే నివేదికపై శాసనసభలో కూలంకషంగా చర్చించిన తర్వాతే తుది విధివిధానాలను ఖరారు చేస్తామని సీఎం వెల్లడించారు.

**తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు** భూపాలపల్లి వంటి జిల్లాలను రద్దు చేసి పాత జిల్లాల్లో కలుపుతారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సీఎం తిప్పికొట్టారు. పరిపాలనను ప్రజలకు మరింత దగ్గర చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎటువంటి రాజకీయ స్వార్థం లేదని ఆయన స్పష్టం చేశారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై పూర్తి స్థాయి స్పష్టత రానుంది.

## లడ్డు వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

### లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల

### అయోధ్య లడ్డూలకు ప్రత్యేక నెయ్యి వాడటమే కల్తీకి నిదర్శనం

### మఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలి

తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం" అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు.

# రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు

## 2026-27 బడ్జెట్‌లో 8,000 కోట్లు కేటాయించాలి.





### పంట కాలువల నిర్మాణానికి 1,250 కోట్లు వెచ్చించి 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి

### సీమ ప్రాజెక్టులపై వివక్ష వద్దు

### బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక ) రాయలసీమ వ్యవసాయాభివృద్ధికి కీలకమైన గాలేరు=నగరి, తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా వంటి సాగునీటి ప్రాజెక్టులు నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ పూర్తికాకపోవడం దురదృష్టకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం రాయలసీమలో ఉన్నప్పటికీ, సాగునీటి నిధుల కేటాయింపుల్లో తీవ్ర అసమతుల్యత కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో బొజ్జా మాట్లాడుతూ.. ప్రభుత్వ అంచనాల ప్రకారం రాయలసీమలో ఉన్న పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రాజెక్టుల ఆధునీకరణకు సుమారు ₹60,000 కోట్ల రూపాయల నిధులు అవసరం ఉందని ఆయన తెలిపారు.

అయితే గత పది సంవత్సరాల్లో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు సగటున ప్రతి సంవత్సరం ఖర్చు పెట్టింది కేవలం ₹1,508 కోట్ల రూపాయలు మాత్రమే అని వెల్లడించారు. ఈ విధంగానే నిధులు కేటాయిస్తే, ప్రాజెక్టు నిర్మాణ వ్యయాలు పెరగవు అని ఊహించినా కూడా రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి కావడానికి ఇంకా 40 సంవత్సరాలు పట్టే పరిస్థితి ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో 202627 బడ్జెట్‌లో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు కనీసం ₹8,000 కోట్లు కేటాయించి, ఒకే సంవత్సరంలో 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ₹1,250 కోట్లు పంట కాలువల నిర్మాణానికి కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గుండ్రేవుల, వేదవతి, =ఇూ నిర్మాణాలకు,గాలేరు=, హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ, ప్రాజెక్టుల్లో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయడానికి, గోరుకల్లు, అలుగనూరు, అన్నమయ్య ప్రాజెక్టుల మరమ్మతులకు, ఎస్సార్ బీసీ కాలువలో 22,000 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని తరలించి గోరకల్లు రిజర్వాయర్ కు తీసుకోవడానికి ఉన్న అడ్డంకులు తొలగించడానికి కలిపి సుమారు ₹6,750 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు.రాయలసీమ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడానికి, ప్రాజెక్టుల ఆధునీకరణకు, అలాగే చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులను 3 లేదా 4 సంవత్సరాలలో పూర్తి చేయడానికి ప్లాన్ ఏర్పాటు చేసి, టైమ్‌బౌండ్ కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల సంక్షేమం కోసం కలిసి పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, రెండు రాష్ట్రాలకు ప్రయోజనకరమైన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. అలాగే రాయలసీమ, తెలంగాణ, కోస్తా ప్రాంతాలకు కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు పూడికతో జీవితకాలం తగ్గిపోకుండా ఉండేందుకు, శ్రీశైలం రక్షణకు అవసరమైన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణాన్ని తెలంగాణ ముఖ్యమంత్రిని ఒప్పించి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రాయలసీమ సాగునీటి సమస్య పరిష్కారం కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం కాదని, ఇది రాష్ట్ర వ్యవసాయ భద్రత, త్రాగునీటి భద్రత, ప్రాంతీయ సమతుల్యత, సమగ్ర అభివృద్ధితో నేరుగా ముడిపడి ఉన్న కీలక అంశమని బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, నంది రైతు సమాఖ్య అధ్యక్షులు బెక్కం రామసుబ్బారెడ్డి, న్యాయవాది అసదుల్లా, భాస్కర్ రెడ్డి, జానో జాగో మహబూబ్ భాష, బిజ్జల క్రిష్ణమోహన్ రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, పట్నం రాముడు, మహమ్మద్ ఫర్వేజ్, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి



నందిపత్రిక-డోన్ డోన్ పట్టణంలోని న్యూ మధు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుక సోమనాథేశ్వర రెడ్డి, పల్లవి వివాహ మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులను అభినందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివాహ బంధంతో ఒక్కటవుతున్న ఈ నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాటు స్థానిక కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.



కర్నూలు నంది పత్రిక.... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# వైసిపి మూకలు అసత్య ప్రచారాలు మానుకోండి.






### వాస్తవాలు తెలుసుకొని మాట్లాడండి.

### సోషల్ మీడియా లో అసత్య ప్రచారాలు చేసే వారిపై పరువు నష్టం దావా వేస్తాను.

### మంత్రి నారా లోకేష్ మాట్లాడిన వీడియో మీరే చూడండి.

### నంద్యాల తులసిరెడ్డి కి మంత్రి నారా లోకేష్ ప్రశంస.

### చప్పట్లు కొట్టిన కార్యకర్తలు.

### టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేస్తా.

### కార్యకర్తల సమస్యలు ధైర్యంగా చెప్పండి.

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక ) మంగళ గిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన బూత్ మేనేజ్మెంట్ వర్క్ షాపులో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నా పై ఆగ్రహం వ్యక్తం చేశారని కొందరు వైసిపి మూకలు అసత్య ప్రచారాన్ని సీనియర్ న్యాయవాది,మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి ఖండించారు.ఈ సందర్భంగా ఆయన ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశం అక్కడ జరిగిన అంశాలు,విడియో మీడియా కు అందించి వాస్తవాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అధ్యక్షతన బూత్ మేనేజ్మెంట్ వర్క్ షాప్ జరిగిందన్నారు.రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు హాజరయ్యారన్నారు.సమావేశంలో సాయంత్రం నాలుగు గంటలకు నాకు అవకాశం వచ్చిందన్నారు.ఆళ్లగడ్డ నియోజక వర్గం లోని బూత్ లలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చానన్నారు.బూత్ లలో కార్యకర్తల సమస్యలు స్థానిక ఎమ్మెల్ల దృష్టికి తీసుకొచ్చానన్నారు.ప్రధానంగా తహశీల్దార్,పోలీస్ స్టేషన్ లలో ఇంకా వైసిపి కి మద్దతుగానే అధికార యంత్రాంగం పనిచేస్తున్న విషయాన్నిమంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చా అన్నారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తులసిరెడ్డి అంటే ఉమ్మడి జిల్లాలో మీరు అందరికీ తెలుసు,వారికి మీరు తెలుసని ప్రశంసలు కురిపించడంతో అందరు చప్పట్లు కొట్టారు.రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో బూత్ సమస్యలు తెలుసన్నారు.బూత్ కు సంబంధించిన అన్ని విషయాలు తెలుసని కార్యకర్తలు ఎవరు ఇబ్బందులు పడకుండా ఇంచార్జ్ మినిస్టర్ తో మాట్లాడి జిల్లా ఎస్పీ,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి కార్యకర్తలకు న్యాయం చేసే విధంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు.కార్యకర్తలు సమస్యలు వచ్చినప్పుడు ధైర్యం గా బయట పెడితే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అన్నారు.మంగళగిరిలో జరిగింది ఒకటి అయితే నా పై కక్షతో కొందరు వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.వాస్తవాలు తెలుసుకొని పోస్టింగ్స్ పెట్టాలన్నారు.సోషల్ మీడియా లో అవాస్తవాలు రాసిన వారిపై పరువునష్టం దాఖలు చేస్తానని హెచ్చరించారు..మంగళగిరిలో జరిగిన సమావేశం విడియో లను మీడియా కు అందించి అక్కడ జరిగిన విషయం మీరే చూడాలని పేర్కొన్నారు.కళ్ళతో చూసి,చెవులతో విన్నట్టు వైసిపి ముఖాలు కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో వ్యాపారవేత్త గౌరీనాథ్, మహానంది మండలం మాజీ ఎం.పి. పి.నాగ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుపై జరిగిన దాడిని ఖండించిన సిపిఐ ఏపీడబ్ల్యూజే




బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 8: ఏపీ టుడే మీడియా రిపోర్టర్ ఆంజనేయులుపై జరిగిన దాడిని జిల్లా సిపిఐ పార్టీ నాయకులు ఖండించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఎరువుల పంపిణీ విషయంలో ఆంజనేయులు కథనాన్ని ప్రచురిస్తే విచారణ పేరుతో పిలిపించి భౌతికంగా దాడి చేయడం అమానుషమైన చర్య అని అన్నారు. జర్నలిస్టులకు రక్షణ కరువైందని, అరాచక పాలనకు ఇదొక నిదర్శనమని అభివర్ణించారు. అధికార బలంతో మీడియా గొంతు నొక్కాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై దాడులు జరగడం సమాజానికి క్షేమకరం కాదన్నారు. ఘటనకు బాధ్యులైన వ్యక్తులపై కేసులు నమోదు చేసి క ఠినంగా శిక్షించాలని పోలీసు యంత్రాంగాన్ని సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

**పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడమే ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురాముడు** ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తే భౌతిక దాడులకు దిగడం సరైనది కాదని ఇది పూర్తిగా పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవడమేనని ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు రఘు రాముడు విమర్శించారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేస్తున్న నాయకులు వారికి కావాల్సినంత ఎరువులు తీసుకుంటూ ఉండటం వల్ల సామాన్య రైతులకు అందడం లేదన్నది వాస్తవమైన విషయమని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చిన ఏపీ టుడే రిపోర్టర్ ఆంజనేయులుపై దాడి చేయడం పట్ల రఘు రాముడు ఖండించారు. విలేకరిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## తాడేపల్లిలో మహాధర్నాను జయప్రదం చేయండి

నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 08. (నంది పత్రిక ):ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు అధ్యక్షతన రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చెయ్యాలని, రజకుల సమస్యలు – ప్రభుత్వ విధానాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి గురు శేఖర్, నంద్యాల జిల్లా కార్యదర్శి సి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం నంద్యాల నగర కార్యదర్శి డి. లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఏకగ్రీవంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని. జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులు భర్తీ చేసి యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని. రజకుల సంక్షేమానికి రాబోయే బడ్జెట్లో కనీసం 1000 కోట్ల రూపాయలు కేటాయించి రజకుల సంక్షేమానికే ఖర్చు చేయాలని. చెరువులు గుంటలు పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని. రౌండ్ టేబుల్ సమావేశంలో ఈనెల 20వ తారీకు గుంటూరు జిల్లా తాడేపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మెయిన్ రోడ్ లో జరిగే మహాధర్నాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు తీర్మానాన్ని ఏకగ్రీవం అదేవిధంగా కార్మిక సంఘాలు తలపెట్టిన ఫిబ్రవరి 12వ తారీకు దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వి. రామకృష్ణ, గోకారమయ్య, జిల్లా కమిటీ సభ్యులు కవిత, వెంకట శివ, రంగస్వామి, వెంకటేశ్వర్లు, నరసింహులు, పాల్గొన్నారు.



# విస్తరణలో గుర్తించబడని ఆస్తిదారులు ముందుకు రావాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### ఎన్‌హెచ్-340సి రహదారి విస్తరణ వేగవంతం

### యాజమాన్య పత్రాలతో నగరపాలక సంస్థను సంప్రదించాలి



కర్నూలు నంది పత్రిక..... నగరంలోని శ్రీ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు జాతీయ రహదారి340సి విస్తరణ పనులలో భాగంగా కొన్ని ఆస్తుల యాజమాన్యం గుర్తించబడని పరిస్థితి ఉన్నందున సంబంధిత యజమానులు లేదా వారి చట్టబద్ధ వారసులు నగరపాలక సంస్థను సంప్రదించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారిని 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో ప్రభావిత ఆస్తులకు బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టిడిఆర్‌లు) మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ప్రభావిత ఆస్తిదారులు అవసరమైన పత్రాలతో ముందుకు రావాలని సూచించారు. విస్తరణలో ప్రభావితమైన కొన్ని ఆస్తుల యాజమాన్య వివరాలు పూర్తిగా లభించకపోవడంతో, సంబంధిత యజమానులు లేదా వారసులు తమ టైటిల్ డీడ్లు, ఇతర పత్రాలతో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరారు. ఇంకా సమ్మతి పత్రాలు సమర్పించని ఆస్తిదారులు వెంటనే వాటిని అందజేయాలని సూచించారు. ఇప్పటికే సమ్మతి ఇచ్చిన వారు విధి విధానాల ప్రకారం గిఫ్ట్ డీడ్ నమోదు పూర్తి చేసుకుని అనంతరం టిడిఆర్ బాండ్లను పొందవలసిందిగా పేర్కొన్నారు.నిర్దేశిత గడువులోగా క్లెయిమ్‌లు లేదా అవసరమైన పత్రాలు అందనియెడల నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టబడతాయని స్పష్టం కమిషనర్ చేశారు.యాజమాన్యం గుర్తించబడని ప్రభావిత భూములు / ప్లాట్లు: జోహరాపురం గ్రామం సర్వే నం.109 లోని ప్లాట్ నంబర్లు 19, 26, 27, 28, 30, 31, 32, 109, 110, 111, 112, 113, 114, 148, 149, 150, 151, 152; సర్వే నం.114 లోని ఖాళీ స్థలం; సర్వే నం.100 లోని ప్లాట్ నంబర్లు 9, 10; సర్వే నం.106/1, 106/2 లోని ఖాళీ స్థలం; సర్వే నం.117 లోని ఖాళీ స్థలం; సర్వే నం.135 లోని ప్లాట్ నంబర్లు 53, 54, 55, 56.కల్లూరు గ్రామం సర్వే నం.663/బి, 669/బి లోని ప్లాట్ నంబర్లు 1, 5, 31; సర్వే నం.660/సి లోని ప్లాట్ నంబర్లు 11, 12, 26, 27, 36, 42; సర్వే నం.664/బి లోని ప్లాట్ నంబర్లు 1, 2, 3, 4, 26, 29; సర్వే నం.663/ఎ లోని ప్లాట్ నంబర్లు 168, 176; సర్వే నం.661/బి లోని ప్లాట్ నంబర్లు 1, 2, 3, 4, 5.

# పవిత్ర రంజాన్ మాసంలో పుణ్యాలను మూట కట్టుకోండి





**అన్ని మాసాలలో కెల్లా పవిత్రమైన మాసం రంజాన్ మాసం జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ ఆద్వర్యంలో రంజాన్ ధార్మక, సమాజసేవపై బహిరంగ సభ ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక ). నంద్యాల.... పవిత్ర రంజాన్ మాసంలో పుణ్యాలను మూట కట్టుకోవాలని, అన్ని మాసాలలో కెల్లా పవిత్రమైన మాసం రంజాన్ మాసమని మత పెద్దలు, ఉలేమాలు బోధించారు. జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ ట్రస్ట్ ఆద్వర్యంలో రంజాన్ ధార్మక, సమాజసేవపై నంద్యాల పట్టణ మున్సిపల్ టౌన్ హాల్ నందు భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు హైదరబాదుకు చెందిన హాజరత్ మౌలానా గయాస్ అహ్మద్, సఫ బైతుల్ మాల్, బెంగళూరుకు చెందిన మాలానా హుమాయాన్ ఖాన్ సాహెబ్ లతో పాటు టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, అబ్దుల్ సమద్, బిల్డర్ అబ్దుల్లాతో పాటు జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ కమిటీ సభ్యులు మౌలానా హుస్సేన్ సాహెబ్ రషాది, మౌలానా ఇద్రిస్ సాహెబ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రంజాన్ యొక్క పవిత్రత, రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాసాల వల్ల కలిగే లాభాలు అలాగే ప్రవక్త యొక్క నడవడిక, రంజాన్ మాసంలో ఆయన అనుసరించిన విధానాలు తదితర వాటిని విపులంగా వివరించారు. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ నెలలో ఉపవాసాలు ఎలా ఉండాలి, ఎటువంటి నియమాలు పాటించాలి, ప్రవక్త అనుసరించిన ఉదాహరణలతో సహా వివరించారు. తాము బాగుండడమే కాకుండా తమ పొరుగు వారికి కూడా సహాయం చేయాలన్న గుణం ప్రవక్త నుండి పలువురు ప్రవక్తలు ఆచరించారని, వాటిని ముస్లిం సమాజం ఆచరించాలని వారు పేర్కొన్నారు. సమాజసేవ కోసం చేయాల్సిన పనులు, వాటి అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హాఫిజ్ షరీఫ్ సాహెబ్, హఫీజ్ కరీముల్లా సాహెబ్, హఫీజ్ అబ్దుల్ వహీద్ సాహెబ్, హఫీజ్ షబ్బీర్ సాహెబ్, ఖాజీ నూర్ అహ్మద్ సాహెబ్, బండి ఆత్మకూరు ఖాజీ షఫీఉల్లా నూరి, గవర్నమెంట్ ఖాజీ ముఫ్తీ షఫీఉల్లాసాబ్, హఫీజ్ మహబూబ్ బాషా సాహెబ్, హాఫిజ్ షరీఫ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 8 నంది పత్రిక ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫిబ్రవరి 9 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ తెలియజేసారు.

## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన టీడీపీ యువనేత మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి



నంది పత్రిక -డోన్ డోన్ మండలం, ధర్మవరం గ్రామానికి చెందిన ఆటో మల్లు నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన డోన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆరోగ్య మల్టీస్పెషలిటీ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి ఈరోజు హాస్పిటల్‌ను సందర్శించి మల్లు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గౌతమ్ కుమార్ రెడ్డి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదానికి గురైన మల్లు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. బాధితుడికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్





నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక ) నంద్యాల నియోజకవర్గంలో మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రజలు ఆపద సమయాల్లో అందించే మెడికల్ రీయబర్స్మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు 54 మంది లబ్ధిదారులకు 29 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో 22 సార్లు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశామన్నారు.దాదాపు 550 మందికి 3 కోట్ల వరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఇప్పటివరకు లబ్ధిదారులకు పంపిణీచేశామన్నారు.ఈ రోజు నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా 29 లక్షల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు . కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు . నంద్యాల టౌన్ , నంద్యాల మండలం మరియు గోస్పాడు మండల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు . ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ లతో పాటు ఫిరోజ్ , ఫయాజ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, కౌన్సిలర్లు కండే శ్యాం సుందర్ లాల్, జైనాభి, షేక్ మున్న మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు



## పోరుమామిళ్ల నూతన ఎస్ఐ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిసిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు




పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8 (నంది పత్రిక)పోరుమామిళ్ల మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. హనుమంతును ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల చెన్నారాయుడు, హ్యూమన్ రైట్స్ సెక్రెటరీ గంప శ్రీనివాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ఎస్ఐ హనుమంతు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన, త్వరలోనే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలపై స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన నూతన ఎస్ఐ హనుమంతుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు తెలిపారు.

# ఫిబ్రవరి 12 వ తేది దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ సిపిఎం మద్దతు.




**లేబర్ కోడ్స్ తిప్పికొడదాం.**

**కార్మిక హక్కులను కాపాడుదాం.**

**కార్పొరేట్లకు ఊడిగం.. కార్మికులకు బానిసత్వం**

**- కేంద్రంపై వామపక్ష నేతల ఆగ్రహం**

నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 08. (నంది పత్రిక ):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి తలొగ్గి, కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తోందని సిపిఐ, సిపిఎం నేతలు ధ్వజమెత్తారు. దేశ సంపదను దోచిపెడుతూ, శ్రమజీవుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయిబాబా నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. రమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, వాటిని కేవలం 4 కోడ్‌లుగా కుదించడం దుర్మార్గమని నేతలు విమర్శించారు. ఈ కొత్త కోడ్ల వల్ల 8 గంటల పని విధానం కనుమరుగై, 12 నుండి 13 గంటల పని భారం పడుతుందని, అదనపు పనికి వేతనం అడిగే హక్కు కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రోజుకు కేవలం రూ. 173గా నిర్ణయించడం కార్మికులను దగా చేయడమేనని, సమ్మె చేయాలంటే 60 రోజుల ముందే నోటీసు ఇవ్వాలన్న నిబంధన కార్మిక గొంతు నొక్కడమేనని మండిపడ్డారు. దేశంలోని ఓడరేవులు, రక్షణ, బ్యాంకింగ్ వంటి కీలక రంగాలను మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు ధారాదత్తం చేస్తోందని వారు విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా పని గంటలను 12 గంటలకు పెంచుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం కార్మిక వ్యతిరేక చర్య అని, దీనికి ప్రతిపక్ష వైసిపి కూడా వత్తాసు పలుకడం శోచనీయమని పేర్కొన్నారు. అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 520 సంఘాలు పిలుపునిచ్చిన ఈ సమ్మెలో రైతులకు గిట్టుబాటు ధర, విద్యుత్, విత్తన సవరణ బిల్లుల రద్దు వంటి డిమాండ్ల కోసం ప్రతి ఒక్కరూ కదలాలని కోరారు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శిఎస్. బాబా ఫక్రుద్దీన్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ. నాగరాజు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి. మురళీధర్ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాముడు.సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూముని శ్రీనివాసులు.జి. లక్ష్మీదేవి, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ వ్యవసా కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్. జి. హరినాథ్. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి.తదితరులు పాల్గొన్నారు.



## పేషంట్ల సహాయకులకు అన్నదాన కార్యక్రమం



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 08. (నంది పత్రిక ):ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిఎస్సి మరియు కె వి ఎస్ సి కు చెందిన 1986 ,1989 బ్యాచ్ చెందిన బిఏ పూర్వ విద్యార్థులు ఆదివారం గవర్నమెంట్ హాస్పటల్ నందు పేషంట్ల సహాయకులకు అన్నదాన కార్యక్రమం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కే రామసుబ్బయ్య కె సురేష్ రెడ్డి ఎం శంకర్ లలితా సరస్వతి సత్యం నాగ ప్రసాద్ మదన గోపాల్ ఏసీ మద్దిలేటి కమలమ్మ వీరశేఖర్ వెంకట్రావుల్దంతదితరులు పాల్గొనడం జరిగింది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని తమ శక్తి మేరకు తమ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఉద్దేశంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



# విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యం





### కమిషనర్ ఎన్.మౌర్య.

### సిర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్షిప్స్ పంపిణీ

**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 8 నంది పత్రిక** విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యం అవుతుందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోసియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాక్ టు స్కూల్ అనే కార్యక్రమం ద్వారా కొండవీటి వెంకట కవి స్కాలర్షిప్స్ పంపిణీ కార్యక్రమం వేమన విజ్ఞాన కేంద్రం లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నగరపాలక సంస్థ ఎన్.మౌర్య మాట్లాడుతూ ఆడపిల్లలు తల్లి,తండ్రి లేకపోతే సమాజంలో ఎలాంటి ఇబ్బంది పడుతున్నారని, అలాంటి సమయంలో సిర్డ్స్ సంస్థ మీలాంటి పిల్లలను గుర్తించి స్కాలర్షిప్ ఇవ్వడం చాలా అభినందనీయం అని తెలిపారు. ఆడపిల్లలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలి అంటే అది చదువు ద్వారానే సాధ్యం అని తెలిపారు. అలాగే చదువు ఉంటేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ 150 మంది పిల్లలకు 28 లక్షల రూపాయలు స్కాలర్షిప్ అందజేయడం చాలా అభినందనీయమని, స్కాలర్షిప్ తీసుకున్న పిల్లలు చదువులలోనే కాదు ఆటల్లో కూడా రాణించాలని క్రీడలకు సంబంధించి ఎటువంటి సాయం చేయడానికి అయినా ప్రభుత్వం ముందు ఉంటుందని క్రీడలను ప్రోత్సహించడమే నా లక్ష్యం అని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి టి.నరసింగరావు మాట్లాడుతూ సిర్డ్స్ సంస్థ తల్లి తండ్రి లేక లేని పిల్లలను గుర్తించి వారికి చదువు కోసం స్కాలర్షిప్స్ అందజేయడం చాలా అభినందనీయం అని తెలుపుతూ, మా నాన్న కూడా తనకున్న తక్కువ జీతంతో మమ్మలి చదివించారని. చిన్నప్పుడు కష్టపడి కాకుండా ఒక్క లక్ష్యం పెట్టుకుని ఇష్టపడి చదివానని తెలిపారు. మీరందరూ కూడా కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని తెలిపారు చదువు ఒకటే మనిషిని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుందని తెలిపారు. సిర్డ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ సిర్డ్స్ సంస్థ ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు స్కాలర్షిప్ పంపిణీ చేస్తుందని, అందులో భాగంగా ఈ సంవత్సరం 150 మంది పిల్లలకు 28 లక్షల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లా గ్రామీణభిరుద్ది సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు, మాట్లాడుతూ స్కాలర్షిప్ అందుకున్న పిల్లలు అందరూ కూడా ఉన్నతలక్ష్యం తో చదవాలి అని అపుడే తను అనుకున్న లక్ష్యం సాధిస్తారు అని తెలిపారు. తుడా సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పేద పిల్లలకోసం పని చేస్తున్న సిర్డ్స్ సంస్థ కి అభినందనలు తెలియజేస్తూ స్కాలర్షిప్ అందుకున్న పిల్లలు అందరూ కూడా ఉన్నతంగా ఎదగాలి అని మీరూ కూడా మరొక్కరికి సహాయం చేయాలి అని తెలిపారు. ప్రముఖ మెజీషియన్ శ్యామ్ జాదూగర్ మాట్లాడుతూ పిల్లలు అందరూ మానసిక ఒత్తిడి లేకుండా చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిర్డ్స్ సంస్థ ప్రతి నిధులు, పిల్లలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



# రెండు లక్షల వెదురు పట్టివేత

### బొలెరో వాహనం సీజ్

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 8 :** అటవీ ప్రాంతం నుండి అక్రమంగా తరలిస్తున్న వెదురు కర్రల బొలెరో వాహనాన్ని పట్టుకున్నామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝూ ఆదివారం సాయంత్రం తెలిపారు. అందిన సమాచారం మేరకు డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఓ,బండి ఆత్మకూరు రేంజి మొబైల్ పార్టీ సిబ్బంది గస్తీని నిర్వహిస్తుండగా బండి ఆత్మకూరు రేంజ్ లోని నారాయణపురం గ్రామం నుండి ఒక బొలెరో వాహనం వెదురు కర్రలను లోడ్ చేసుకొని వెళుతుందని సమాచారంతో రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝు, మొబైల్ పార్టీ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రత్న ప్రభావతి,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగేంద్రయ్య తోపాటు మొబైల్ పార్టీ ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి బొలెరో వాహనాన్ని వెంబడించడం జరిగింది. అన్నారు. ఆ వాహనం నారాయణపురం గ్రామం నుండి పరమటూరు రస్తా వైపు వెళు తుంటే వాహనాన్ని వెంబడించి కొత్తకోట హైవే జంక్షన్ వద్ద తెల్లవారుజామున పట్టుకోవడం జరిగిందని అన్నారు. అందులో ముద్దాయిలు డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి వాహనాన్ని వదిలి పారిపోయారని అన్నారు. సిబ్బందితో సహా తాము అక్కడికి వెళ్లి వాహనాన్ని స్వాధీనం చేసుకొని డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు డైరెక్టర్ నంద్యాల వారి ఆఫీసుకు తరలించడం జరిగిందని అన్నారు. అందులో వెదురు కర్రల విలువ సుమారు రెండు లక్షల రూపాయలు విలువ చేస్తాయని అంచనావేశామని అన్నారు. బొలెరో వాహనం నంబరు ఏపీ 39 యు వి 47 61 కాగా అది గాజుల పల్లెకు సంబంధించిన వాహనంగా గుర్తించామని అన్నారు.ముద్దాయిలు ఆంజనేయపురం కొట్టాలకు సంబంధించిన వారని తమ విచారణలో తేలిందని అన్నారు. అటవీ సంపదను కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తే వారిపై పీడియా కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపిస్తామని హెచ్చరించారు. వారికి కచ్చితంగా ఆరు నెలల కఠిన కారగారశిక్షతో పాటు జరిమానా కూడా విధించడం జరుగుతుందని అన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ లోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశించి వెదురులను గాని,కలపను గాని,నరికి అక్రమంగా తరలించిన ఎడల అటువంటి వ్యక్తులను ఉపేక్షించమని పేర్కొన్నారు. అటవీ చట్టాల ప్రకారం వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడంలో వెనకాడబోమని అన్నారు. వన్యప్రాణులకు సంబంధించి ఎవరైనా ఉచ్చులు వేసిన, వాటిని చంపిన, వాటి మాంసాన్ని విక్రయించిన కొనుగోలు చేసిన అటువంటి వారిపై అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధిస్తామని పేర్కొన్నారు. అటవీ సంపద పరిరక్షణ విషయంలో ఎవరైనా సమాచారం అందజేస్తే అటువంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వారికి తగిన పారితోషికం అందజేస్తామని రేంజర్ పేర్కొన్నారు. సమాచారం అందజేసే వ్యక్తులు 9885509574 నెంబర్ గల చరవాణి కి ఫోన్ చేయాలని రేంజర్ నాసిర్ జా వివరించారు.




# నేటి (9 వ తేదీన) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

### జిల్లా, డివిజన్, మండల స్థాయిలో రద్దు

### జిల్లా ప్రజలు గమనించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక ...** ఈనెల 09వ తేదీన సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ఎవరు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు. కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి రోజంతా విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రెటరీల కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, హెచ్ఓడిలు అందరూ కలెక్టరేట్లో హాజరవుతారని, డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో డిఎల్డిఓ, డిఎల్పిఓ, ఇతర డివిజన్ స్థాయి అధికారులు ఆర్డీవో కార్యాలయం నుంచి హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండలస్థాయి, మున్సిపాలిటీలలో సంబంధిత తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అందరు మండల స్థాయి అధికారులు ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట అందరూ హాజరు కావాలని తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులలో కూడా సంబంధిత సచివాలయ సిబ్బంది ఫిజికల్ గా సంబంధిత సచివాలయంలోనే ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొనాలన్నారు. అందరు అధికారులు కూడా ఖచ్చితంగా వర్చువల్ విధానంలో ఈ కాన్ఫరెన్స్ లో హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.




# మహానందిలో 16 నుండి రైతు సంబరాలు

### భారీ ప్రైజ్ మనీలను ప్రకటించిన ఎం ఎస్ కౌర ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్

### అఖిల భారత ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీలకు18 భారీ ప్రైజ్ మనీ లు ప్రకటించినట్లు మాలపాటి పుల్లయ్య చౌదరి.



**శిరివెళ్ల ( నంది పత్రిక ):-** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం మహానంది పుణ్యక్షేత్రం నందు శ్రీ కామాక్షి సహిత శ్రీ మహానందిశ్వర స్వామి వారి సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారి ఆశీస్సులతో ఫిబ్రవరి 16 నుండి రైతు సంబరాలు అంబరాన్నట్ట పోతున్నాయని ఎం ఎస్ కౌర ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మాలపాటి పుల్లయ్య చౌదరి గారు తెలియజేశారు. శిరివెళ్ల మండలం గుంపురమానుదిన్నె గ్రామంలో ఆయన మాట్లాడుతూ రైతు సంబరాలలో భాగంగా అఖిలభారత ఎద్దుల బల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్స్ విభాగం నాలుగు లక్షల 45000, న్యూ కేటగిరి విభాగం 2,75,000 .పాలపల్ల విభాగం 1,50,000 నగదు బహుమతులను ఎం ఎస్ కౌర ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపు మొత్తం 18 భారీ ప్రైజ్ మనీలను ప్రకటించామని మాలపాటి పుల్లయ్య చౌదరి తెలియజేశారు. 16.2. 2026 నిర్వహించే పోటీలలో మొదటి బహుమతి లక్ష యాభై వేలు, రెండవ బహుమతి లక్ష, మూడవ బహుమతి 80000 నాలుగవ బహుమతి 60000 ఐదవ బహుమతి 40000 ఆరవ బహుమతి, 25 000 17 - 2 - 2026న జరిగే న్యూ కేటగిరి వృషభరాజ్యముల బల ప్రదర్శన పోటీలలో మొదటి బహుమతి 75000 రెండవ బహుమతి 60000 మూడవ బహుమతి 40000 నాలుగవ బహుమతి 30000 ఐదవ బహుమతి 20000 18 - 2 - 2026 న జరిగే పండ్ల వృషభరాజ్యముల బల ప్రదర్శన పోటీ విజేతలకు మొదటి బహుమతి 50,000 రెండవ బహుమతి 40000 మూడవ బహుమతి 30,000 నాలుగవ బహుమతి 20000 ఐదవ బహుమతి 10000 ఆరవ బహుమతి 7500 మొత్తం ప్రైజ్ మనీలను ఎంఎస్ ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున ప్రకటించినట్లు మాలపాటి పుల్లయ్య చౌదరి పేర్కొన్నారు. రైతు సంబరాలలో భాగంగా నిర్వహించే అఖిల భారత వృషభరాజముల బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు రైతులు ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని మాలపాటి పుల్లయ్య చౌదరి తెలియజేశారు.

### పవిత్ర ఖురాన్ కంఠస్థం పూర్తి చేసిన 7 మంది మదరస విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం నందమూరి నగర్ వెళ్లే దారిలోని నయా ఈద్గా దారుల్ ఉలూం తయ్యిబా మదరసా నందు, 07 మంది విద్యార్థులు ఖురాన్ కంఠస్థం పూర్తి చేసి హాఫిజ్ మరియు అలీమ్ కోర్సు పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీఎం ఫిరోజ్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఎం ఫిరోజ్ గారు విద్యార్థులను అభినందిస్తూ ఖురాన్ను కంఠస్థం చేయడం గొప్ప సాధన, ఇది క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధార్మిక విలువలను పెంపొందిస్తుంది" అని తెలిపారు.అలాగే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు



### వైభవంగా శ్రీ వెంకటరెడ్డి స్వామి తిరునాళ్ల

### ఆధ్యాత్మికతతో పాటు క్రీడా ఉత్సాహం.. కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి

**నంది పత్రిక -ప్యాపిలి** ప్యాపిలి శ్రీ వెంకటరెడ్డి స్వామి తిరునాళ్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు క్రీడా పండగను తలపించాయి. గ్రామస్తులు, క్రీడాభిమానుల కోలాహలం మధ్య ఈ పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి.ఈ కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథిగా టీడీపీ ప్యాపిలి మండల ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన క్రీడాకారులకు కరచాలనం చేసి, వారిని పరిచయం చేసుకున్న అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపిలి ప్రాంతంలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతో ఆడితే జాతీయ స్థాయికి ఎదగవచ్చని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని ఆయన కొనియాడారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభాకర్ రెడ్డిని కబడ్డీ నిర్వాహక కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, కొంగనపల్లె మధు, రామ్మోహన్, ఎస్కే వలి, వెంకటేష్, రమేష్, మధు నాయుడు,చంద్ర, నరేష్,ఓబులేసు పాల్గొన్నారు.



# బీసీలకు తక్షణమే రక్షణ చట్టం తీసుకురావాలి



## జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసింహారావు

## బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టం తప్పనిసరి

**కలసపాడు, ఫిబ్రవరి 8 : (నంది పత్రిక)** రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై వరుసగా దాడులు జరుగుతున్నాయని, బీసీల ప్రాణాలు, ఆత్మగౌరవం ప్రమాదంలో ఉన్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళలు, బీసీ విద్యార్థులు, బీసీ కార్మికులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ పరిస్థితులను అరికట్టేందుకు ప్రత్యేక బీసీ రక్షణ చట్టం తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా బీసీల జీవన పరిస్థితులు ఇప్పటికీ మెరుగుపడలేదన్నారు. రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బీసీలకు కల్పించిన హక్కులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకాలేదన్నారు. అందుకే జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాట బాటలో పయనిస్తూ బీసీ హక్కుల సాధనకు ఉద్యమం కొనసాగిస్తోందని తెలిపారు. దానిలో భాగంగా బద్వేలు నియోజకవర్గంలో మండల, గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని పూర్తిస్థాయిలో నిర్మించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే గత ప్రభుత్వంలో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని, అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ 34 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం గడిచినా ఈ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేదని విమర్శించారు. బీసీల ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. వెంటనే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. కనిగిరి నియోజకవర్గంలో, గుంటూరు జిల్లాలో బీసీలపై జరిగిన దాడులను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో ఓ రజక సోదరుడు ఆటో నడుపుతుండగా ఆధిపత్య వర్గానికి చెందిన వ్యక్తి మోటార్ సైకిల్ తగిలిందనే కారణంతో అతని బట్టలు ఊడదీసి విద్యుత్ స్తంభానికి కట్టేసి హింసించారని తెలిపారు. ఇటువంటి ఘటనలు బీసీల భద్రతపై తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు న్యాయం చేస్తుందనే ఆశతో ఎదురు చూశామని, కానీ ఆ ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మాన్యశ్రీ కన్సీరామ్ ఆలోచన విధానంతో పోరాట బాటలో ముందుకు వెళ్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై, బీసీ మహిళలపై, బీసీ విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే బీసీ రక్షణ చట్టం తప్పనిసరిగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో బీసీ కులగణన చేపట్టి, ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేతివృత్తులు, కులవృత్తులు, సేవా వృత్తుల ద్వారా బీసీలు సమాజానికి సంపద సృష్టించినప్పటికీ విద్యకు దూరమై వెనుకబాటుకు గురయ్యారని తెలిపారు. బీసీ విద్యార్థుల కోసం హాస్టల్ మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్వతంత్ర పోరాటాన్ని కొనసాగిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి. రమణయ్య, డి. బాల గురయ్య, బి. పెద్ద బాలసిందయ్య, జె. సింగరయ్య, జి. వెంకటేశ్వర్లు, బి. గురవయ్య, బి. వెంకటసుబ్బయ్య, ఎల్. బాలరాజు (బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు), బి. బాల పేరయ్య (వన సంరక్షణ ప్రెసిడెంట్), సిహెచ్. రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ వి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుపై దాడి కేసులో పోలీసులకు ఫిర్యాదు




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 8:** ఏపీ టుడే మీడియా రిపోర్టర్ ఆంజనేయులుపై శనివారం జరిగిన దాడి కేసులో ఆదివారం మధ్యాహ్నం బాధితుడు ఆంజనేయులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుడితో పాటు పాత్రికేయులు కొండయ్య, జమాల్, గిరి, ఇస్మాయిల్, సుబ్బయ్య, చంద్రబాబు, నాగా కాంతురెడ్డి, నాగరాజు, నాగవర్ధన్ రెడ్డి, సిటీ కేబుల్ భాషా, శ్రీనివాసులు, వెంకటసుబ్బన్న, తదితరులు కూడా వెళ్లారు. స్టేషన్లో ఉన్న ఏఎస్ఐ అక్బర్ కు ఫిర్యాదు అందజేశారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు గ్రామంలోని పర మటూరు రైతు సేవ సహకార సంఘం లో రైతులకు యూరియా సక్రమంగా అందలేదని పలువురు రైతులు సమాచారం అందించిన మేరకు శుక్రవారం ఏపీ టుడే లో వార్త ను ప్రసారం చేయడం జరిగిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కు చెందిన ఇద్దరు అధికారులు సొసైటీ కి విచారణ నిమిత్తమై వస్తున్నారని బ్యాంకు డైరెక్టర్ ఇస్మాయిల్ ఫోన్ చేసి చెప్పాడని, మీరు బ్యాంకుకు రావాలని కూడా చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏడవ తేది మధ్యాహ్నం తాను బ్యాంకుకు వెళ్ళగా అక్కడ టిడిపి మండల కన్వీనర్ ముమ్మడి నాగ కృష్ణారెడ్డి నన్ను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తూ నానారకాలుగా దుర్భాషలాడి నాపై దాడి చేసి కన్నుపైన గుద్దాడని, దీంతో అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు జోక్యం చేసుకొని కృష్ణారెడ్డిని ఆపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి కారణంగా నా ముఖం కన్ను నొప్పిగా ఉండటంతో నేను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స పొందడం జరిగిందని పేర్కొన్నాడు. కృష్ణారెడ్డి తనపై దాడి చేసిన సంఘటనకు సంబంధించి తన వద్ద వీడియోలు ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. నేను విధి నిర్వహణలో ఉన్న సమయంలో నాపై దాడి చేసిన వ్యక్తిపై చట్టప్ర కారం కఠినంగా చర్యలు తీసుకొని, కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమగ్రంగా విచారణ జరిపి చర్యలు చేపట్టాలని ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.




# ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి.





## సమ్మె పోస్టర్లను విడుదల చేసిన కార్మిక కర్షక సంఘాల నాయకులు.

## విజి.రాం.జి బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

**బేతంచెర్ల ఫిబ్రవరి 8 ( నందిపత్రిక).** కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను యధావిధిగాకొన సాగించాలని, 2 వందల రోజులు పని కల్పించి, 6 వందల రూపాయలు రోజువారి వేతనం ఇవ్వాలని,విజి.రాం.జీ చట్టాన్ని ఉపసంహరించు కోవాలని,ప్రొఫెసర్ స్వామినాధన్ కమీషన్ సిఫార్సులను అమలుచేసి, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని,పెరిగే విద్యుత్, విత్తనాలు,ఎరువుల ధరలను నియంత్రించాలని , కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,వడ్డీ లేకుండా బ్యాంకులలో రుణాలు ఇవ్వాలని కోరుతూ, దేశవ్యాప్తంగా జాతీయ ప్రజా సంఘాలు,కార్మిక సంఘాలు చేపట్టే,ఫిబ్రవరి 12న జాతీయ సమ్మెలో కలిసి ఐక్యంగా పాల్గొంటున్నామని తెలియజేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుశేఖర్, సిఐటియు మండల నాయకులు రహంతుల్లా, మల్లికార్జున, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. రామ మోహన్, రైతు సంఘం సీనియర్ నాయకులు నీలి కిష్టన్నలు తదితరులు కలిసి, ఆర్ఎస్. రంగాపురం శ్రీ మద్దులేటీ స్వామి ముఖద్వారం దగ్గర, జాతీయ కార్మిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు, 10 లక్షల కోట్లకు పైగా రాయితీలను ఇచ్చి, పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించిందని,ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి నుండి మొన్నటి వరకు,అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్లుగా చేసి, పరిశ్రమల యాజమాన్యంనకు, కార్మికులను నయా బానిసలుగా చేసే విధంగా,4 లేబర్ కోడ్లు ఉన్నాయని, వాటి వలన కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేదని, ముఖ్యంగా సమ్మె చేసే హక్కు కోల్పోవడం జరుగుతుందని,పరిశ్రమల యాజమాన్యం ఇచ్చింది తీసుకోవాలని,అంతేగాక అదనంగా పని గంటలు పెంచి,వేతనాలను యాజమాన్యానికి నచ్చే రీతిలో ఇచ్చే పద్ధతిని అవలంబిస్తుందన్నారు. యాజమాన్యానికి నచ్చకపోతే, కార్మికులను ఉద్యోగం నుండి తొలగించవచ్చుని,కార్మిక శాఖ కూడా ఏమి చేయలేదని, వారికి ఎలాంటి అధికారాలు లేకుండా చేసిందని, కార్మికులను రోబోలుగా చిత్రికరించే ప్రయత్నం చేస్తుందని, ప్రపంచ దేశాలు సైతం 8 గంటల పని విధానాన్ని అనుసరిస్తుంటే, మన దేశంలోని కార్మికులు మాత్రం 12 గంటలు పాటు పనిచేయాలని చట్టాన్ని తీసుకురావడం చాలా దుర్మార్గమన్నారు. ఈ చట్టం ద్వారా కార్మికులు మరింతగా నష్టపోయి జీవచ్చవాలుగా మిగిలి పోయే అవకాశం ఉందని అన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యధావిధిగా అమలు చేసి, 2వందల రోజులు పని కల్పించి, 6వందల రూపాయలు రోజు వారి వేతనంగా ఇవ్వాలని,విజి.రాం.జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువుల ధరలను తగ్గించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,వడ్డీ లేకుండా బ్యాంకులలో రుణాలు ఇవ్వాలని దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యావత్ కార్మిక వర్గం అంతా పాల్గొని కేంద్రం మెడలు వంచి కార్మిక వర్గం సత్తా చూపించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మన్న, బ్రహ్మయ్య, మహేష్, లక్ష్మన్న, పెద్దయ్య, నాగ ఎల్లయ్య లు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి



**వెలుగోడు, ఫిబ్రవరి 8 (నంది పత్రిక):** కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆత్మకూరు సిపిఐ తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు ఇ. బీసన్న, దూద్ పిరా, వెలుగోడు మండలం సీపీఐ సీనియర్ నాయకులు హరున్ రషీద్‌తో కలిసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని, పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచడం, ఉద్యోగాలు భద్రత లేకుండా సంస్థలకు అనుకూలంగా చట్టాలు రూపొందించడం తగదని. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ముఖ్యంగా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మెడికల్, విద్యుత్తు, విద్య, ఆర్టీసీ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సర్ కార్మికులను రెగ్యులర్ చేసి ఉద్యోగులుగా గుర్తించాలని. అలాగే ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, 108, 104, ఆరోగ్య మిత్ర, మెప్మా, ఆర్పీ వంటి స్కీం ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల ఆటో కార్మికులు, హమాలీలు, స్ట్రీట్ వెండర్స్, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు వీరికి సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు అందరూ ఐక్యంగా పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

# జర్నలిస్టుపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడే..!!

## ఎరువుల అక్రమాలు బయటపెట్టినందుకు విలేకరిపై టీడీపీ నేతల దౌర్జన్యం..!!

## మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలను సహించం : సీపీఐ..!!

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండల కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న'టుడే టీవీ'జర్నలిస్టు ఎం.ఆంజనేయులుపై టీడీపీ మండల అధ్యక్షుడు నాగకృష్ణారెడ్డి,ఆయన అనుచరులు భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచిన చర్యగా సీపీఐ నంద్యాల జిల్లా నాయకులు తీవ్రంగా ఖండించారు..!! ..పరమటూరు సహకార సంఘంలో ఎరువుల పంపిణీలో జరిగిన అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువచ్చినందుకే కక్షగట్టి అధికారుల విచారణ పేరుతో పిలిపించి మరీ దాడి చేయడం పాలక దౌర్జన్యానికి నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు,సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మండిపడ్డారు..!! ..నిజం రాసిన జర్నలిస్టును కొట్టడం కాదు..తప్పుంటే చట్టపరమైన మార్గంలో ఎదుర్కోవాలని హితవు పలికారు..!! ..మీడియాను భయపెట్టడం ద్వారా అక్రమాలను దాచిపెట్టాలనే ప్రయత్నాలు ఇక సాగవని వారు హెచ్చరించారు..!! ..ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన జర్నలిస్టులపై దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థనే ప్రమాదంలోకి నెట్టుతోందని ఆవేదన వ్యక్తం చేశారు..!! ..జర్నలిస్టులకు రక్షణ లేకపోతే ప్రజల గొంతు మూగబోతుందన్నారు..!!..దాడిలో గాయపడి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు ఆంజనేయులుకు మెరుగైన వైద్యం అందించాలని,దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను డిమాండ్ చేశారు..!!..జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు..!! ..మీడియా స్వేచ్ఛపై దాడులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు దిగుతామని సీపీఐ స్పష్టం చేసింది..!!



# నాగపుష్పం విశిష్టత

**మంత్రాలయం పిబ్రవరి07 (నందిదినపత్రిక ప్రతినిధి)** హిమాచల్ ప్రదేశ్ లోని మండీ నుండి 49 కిమీ దూరంలో ధౌలాధర్ పర్వతశ్రేణుల వద్ద బార్ట్వా లోయలో కమ్రూనాగ్ సరస్సు వద్ద ఉందట ఈనాగపుష్పం వృక్షం. ఈసరస్సును పరాశర్ సరస్సు అని కూడా పిలుస్తారు. భీముడు కమ్రూనాగ్ దేవతతో కలిసి ఇక్కడ ఉన్న సరస్సు ఈపుష్పం నాగుపామును పోలియున్నందువలన, దీన్ని నాగపుష్పం అని పిలుస్తారు. ఈసరస్సులో భక్తులు అనేక వందల సంవత్సరాలనుండి కమ్రూనాగ్ దేవత కొరకు మొక్కుబడిగా బంగారు, వెండి నాణాలు వేస్తూ ఉంటారట. అలా ఈసరస్సు అడుగున అపారమైన సంపద ఉందని ఇక్కడి ప్రజల నమ్మకం. ఈ సంపదను యక్షులు కాపాడుతూ ఉంటారని, అందుకు నిదర్శనంగా ఈనాగుపాము పోలిన పుష్పాలు కలిగిన ఈవృక్షాల రూపంలో సరస్సును కాపలా కాస్తూ ఉన్నారని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఈసరస్సుకు వెళ్లడానికి మండి నుండి కొంతదూరం బస్సులో ప్రయాణం చేసి, ఆ తర్వాత దుర్గమమైన పర్వతాలలో 10 కిమీ కాలిబాటన అధిరో హించాలట. అందువలన టూరిస్ట్ లకు అందరికీ అందుబాటులో లేని దారి. నడవగలిగే వారికి మంచి తీర్థయాత్ర!

## ఢిల్లీలో నిలిపి ఉంచిన కారులో మూడు మృతదేహాలు!

రాజధాని ఢిల్లీలో పీరాగఢి ఫ్లైఓవర్‌పై పార్క్ చేసి ఉన్న కారులో ఒక మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు మృతిచెంది కనిపించారు. ఆదివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రాథమికంగా వీరు విషం సేవించి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతులను రన్‌హోలా ప్రాంతానికి చెందిన రణధీర్ సింగ్ (62), శివ్ నరేశ్ (42), జహంగీర్‌పురికి చెందిన లక్ష్మి సింగ్ (40)గా గుర్తించారు. వీరు ప్రయాణిస్తున్న కారు రణధీర్ సింగ్‌కు చెందినదిగా తేలింది.

# మానవత్వం చాటుకున్న సన్నాల శ్రీనివాసులు రెడ్డి





## 3వ డివిజన్ వైసీపీ ఇంచార్జ్ అక్కలరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో..

## ఎమ్మెల్సీ నెల్లూరు సిటీ వైసీపీ ఇన్చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేతులమీదుగా..

## నిరుపేదలకు ఉపాధి కల్పనకు మూడు తోపుడుబండ్లు అందజేత..

**నెల్లూరు ఫిబ్రవరి 8 నంది పత్రిక:** నేటి సమాజంలో ఎవరి బ్రతుకుదెరువు వారికి బరువైన వేళ భాను కష్టం చేసి సంపాదించే ప్రతి రూపాయిలో పావు వంతు నిరుపేదలకు సహాయం అందించాలనే గొప్ప మనస్తత్వం కొంతమందికి మాత్రమే ఉండొచ్చు వారిలో ఒకరు నెల్లూరు కిసాన్ నగర్ కు చెందిన సన్నాల శ్రీనివాసులు రెడ్డి అని చెప్పుకోవడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నెల్లూరు సిటీ కిసాన్ నగర్ పరిధిలో టీ షాపు నిర్వహిస్తూ మధ్యతరగతి జీవనాన్ని కొనసాగిస్తున్న సన్నాల శ్రీనివాసులు రెడ్డి మొదట్నుంచి 3వ డివిజన్ వైసీపీ ఇంచార్జ్ అక్కలరెడ్డి నారాయణ రెడ్డి వెంటే పయనిస్తూ ఆయనకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైయస్సార్ ఆశయాలను ఆచరణలను తనదైన శైలిలో అవలంభించే దిశగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చేవారు ఆంధ్రభాగంగా వైఎస్ఆర్ యొక్క తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్ఆర్సిపి పార్టీ జెండాను మొదటినుంచి కార్యకర్తలాగే మోస్తూ నేడు నెల్లూరు సిటీ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు తన ఏరియా పరిధిలోని ముగ్గురు నిస్సహాయ కుటుంబాలకు వారి యొక్క జీవనోపాధి మెరుగుపరిచే దిశగా మూడు తోపుడు బండ్లను అందజేసి తన యొక్క ఔన్నత్యాన్ని పెంపొందించే దిశగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు సూపర్ బండ్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడవ డివిజన్ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ అక్కల రెడ్డి నారాయణరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కల్తీ లడ్డుపై కూటమి నాయకులది రోజుకో మాట

## కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతిస్తున్న కూటమి ప్రభుత్వం.. మాజీ ఎమ్మెల్యే కాటసాని



**బనగానపల్లె ఫిబ్రవరి 8 నంది పత్రిక** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం పై కూటమి ప్రభుత్వ నాయకులు రోజుకో మాట మాట్లాడుతు హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బనగానపల్లె లోని వైఎస్సార్సీపీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదంలో ఎటువంటి కల్తి జరగలేదని సిబిఐ తమ నివేదికను కోర్టుకు తెలిపినప్పటికీ కూటమి నాయకులు మాత్రం దాన్ని జీర్ణించుకోలేక రోజుకో మాట మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో లడ్డు ప్రసాదంలో నెయ్యి వాడకుండా పందికోవు ఆవు కొవ్వు చేప నూనె వాడి లడ్డు తయారు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నారా లోకేష్ ఆరోపించారని అయితే వైసిపి ప్రభుత్వ హయం లో లడ్డు తయారీలో ఎటువంటి కల్తి జరగలేదని భావించిన మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి కోర్టును ఆశ్రయించడం జరిగిందని కోర్టు ఆదేశాల మేరకే సిబిఐ తిరుపతి లడ్డుపై విచారణ చేసి అందులో ఎటువంటి కల్తి జరగలేదని నివేదిక ఇచ్చిందని అయినప్పటికీ కూటమి నాయకులు దాన్ని జీర్ణించుకోలేక ప్రసాదంపై రోజుకో మాట మారుస్తూ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమో ప్రజలే గమనించలన్నారు. లడ్డు పై కూటమి నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజల మనసు మార్చాలని వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. కూటమి నాయకులు చేసిన తప్పును ఒప్పుకోకపోగా తిరిగి మరల విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే విషయంపై గుంటూరులో కూటమి నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా దాన్ని తొలగించేందుకు వెళ్లిన మాజీ మంత్రి అంబటి పై దాడికి ప్రయత్నించారని ఆ సమయంలో ఆవేశంలో మాట్లాడిన అంబటి పై ఇంటి మీదకి వెళ్లి దాడి చేసేందుకు ప్రయత్నం చేసి ఆయన ఇళ్ళు, కార్యాలయం వాహనాలు ధ్వంసం చేసారని అన్ని రోజులు వారివే ఉండవని కూటమి నేతలు అది గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎ ఆర్ డైరీ నుంచి వచ్చిన నెయ్యి ట్యాంకర్ లను వెనక్కి పంపించిన కూటమి ప్రభుత్వం తిరుపతి కి సమీపంలోని క్రషర్ మిషన్ వద్ద టాంకర్ ఉంచి అదే నెయ్యి ట్యాంకర్ లను వైష్ణవి డైరీ పేరుతో అదే నెయ్యిని వాడరని సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక ఏదో ఒక విషయం మీద డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఇప్పటికైనా డైవర్ట్ పాలిటిక్స్ కు చరమగీతం పాడి అభివృద్ధి పై దృష్టి పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమం లో ప్రచార కార్యదర్శి సిద్ధం రామ్మోహన్ రెడ్డి, అబ్దుల్ ఫైజ్, సన్నల జనార్దన్ రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# అవగాహనతో మూర్ఛలకు అడ్డుకట్టు వేద్దాం

## అంతర్జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం డాక్టర్. చల్లెపల్లె బాబూరావు



**కర్నూలు నంది పత్రిక....** చూడటానికి ఎంతో ఆరోగ్యకరంగా ఉంటూ ఉన్నట్లుండి క్రిందపడి స్పృహ కోల్పోయి కాళ్లు చేతులు కొట్టుకోవడం చూస్తాం దీనినే ఫిట్స్ అంటాము. ఇలా ఫిట్స్ రెండుసార్లు అంతకన్నా ఎక్కువసార్లు వస్తే దానిని ఏపిలెప్సీ అంటాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏడు కోట్ల మంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. మన భారతదేశంలో 1.2 కోట్ల ఇండియన్స్ మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. మూర్ఛ జబ్బు గురించి అవగాహన కల్పించడం కోసం ఇంటర్నేషనల్ సొసైటీ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10న ఇంటర్నేషనల్ ఎపిలెప్సి డే జరుపుకుంటారు. అపోహలను చెరిపి, అవగాహనను నిర్మిద్దాం.

మూర్ఛ రోగం అనేది ఏ వయసు వారికి వస్తుంది?

మూర్ఛ రోగం ఏ వయసు వారికైనా రావచ్చు. ఒక్కొక్క వయసులో ఒక్కొక్క కారణం ఉంటుంది.

**ఫిట్స్ కి గల కారణం ఏమిటి?** పుట్టిన పిల్లల్లో డెలివరీ సమయంలో రక్త సరఫరా బ్రెయిన్ కి సరిగా అందకపోవడం వల్ల ఫిట్స్ రావచ్చు. మెదడు ఎదుగుదల సరిగా లేకపోవడం కూడా ఫిట్స్ కు గల కారణం కావచ్చు. కొంతమంది పిల్లల్లో జ్వరంతోపాటు ఫిట్స్ వస్తూ ఉంటాయి. కొన్ని జన్యుపరమైన కారణాలు కూడా ఫిట్స్ కి దారితీస్తాయి. మద్యం అతిగా తీసుకోవడం మరియు ఒక్కసారిగా మానేయడం వల్ల, మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కూడా ఫిట్స్ రావచ్చు రోడ్డు ప్రమాదంలో తలకు గాయం అవ్వటం, బ్రెయిన్ ట్యూమర్స్ కూడా ఫిట్స్ కి కారణం అవుతాయి.

**మూర్ఛలో రకాలు:**

**సాధారణ మూర్ఛలు:** ముందస్తు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా వస్తుంది. స్పృహ కోల్పోవడం మరియు కాళ్లు చేతులు నియంత్రణ కోల్పోవడం చూస్తూ ఉంటాం. నోటి నుండి నురగ రావడం నియంత్రణ లేకుండా మల మరియు మూత్ర విసర్జనలు దుస్తులలోనే అవ్వటం, నాలుక కొరుక్కోవడం వంటివి చూస్తూ ఉంటాం. కొన్ని రకాల సాధారణ మూర్ఛలు శరీరంలో కొన్నిసార్లు జర్కులు రావడం (మయో క్లోనిక్ ఫిట్స్) కొన్నిసార్లు 10 నుండి 20 సెకండ్ల వరకు స్పందించకుండా ఉంటాము (అబ్సెన్స్ ఫిట్స్) అంటాం.

**ఫోకల్ మూర్ఛలు:** మెదడులో ఒక చిన్న ప్రాంతం నుండి అసాధారణ విద్యుత్ వల్ల ఇవి మొదలవుతాయి. ఈ రకం మూర్ఛల్లో ఫిట్స్ వచ్చేముందు పేషెంట్ కి ఒక రకమైన భయం రావడం కొంతమందిలో ఒక రకమైన అసాధారణ వాసనలు తెలియటం కళ్ళముందు రంగులైట్ల దృశ్యాలు కనిపించడం చూస్తాం. ఫిట్స్ మొదలయ్యాక స్పందించకుండా అవటం పెదవులు చప్పరిస్తూ ఉండటం ఉంటాయి.

**చికిత్స:** ఫిట్స్ జబ్బుని 70% మందిలో సరైన మందులను సరైన మోతాదులో వాడటం వల్ల నియంత్రణలోకి తీసుకురావచ్చు. 30% మందిలో రెండు రకాల మాత్రల కన్నా ఎక్కువ అవసరం అవుతాయి వారిని డ్రగ్ రెసిస్టెంట్ ఎపిలిప్సి అంటాము. ఈ డ్రగ్ రెసిస్టెన్స్ ఉన్నవారిలో ముఖ్యంగా ఫోకల్ ఫిట్స్ ఉన్నవారిలో వీడియో ఈసీజీ, మరియు బ్రెయిన్ ఇమేజింగ్ సహాయంతో ఫిట్స్ మొదలయ్యే ప్రాంతాన్ని మెదడులో గుర్తించి దానిని తొలగించవచ్చు. వాగస్ నర్వ్ స్టిములేషన్ తో కూడా ఫిట్స్ ని నియంత్రణలోకి తీసుకురావచ్చు. కిటో జెనిక్ డైట్ వంటివి కూడా ఉపయోగపడతాయి.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి**

1) క్రమం తప్పకుండా మందులు వాడాలి

2) రోజుకి 6 నుండి 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి 3) మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలి

4) మత్తుమందులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

5) పదేపదే ఫిట్స్ వచ్చేవాళ్లు డ్రైవింగ్, స్విమ్మింగ్ తప్పనిసరిగా ఆపడం మంచిది.

6) మూర్ఛ వ్యాధి ఉన్నవారు వారి జబ్బును గురించి తెలియజేసే కార్డు ని పెట్టుకుంటే మంచిది.

**ఫిట్స్ వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు:** మూర్ఛ వచ్చినప్పుడు ఎవరైనా పడిపోతే వారికి గాయాలు కాకుండా చూడాలి. చుట్టుపక్కల ఉన్నవారు ప్రమాదకరమైన వస్తువులను తొలగించాలి. వాంతిని మింగకుండా ఉండేలా పక్కకు తిప్పి పడుకోబెట్టాలి.

తల క్రింద కాస్త ఎత్తుగా ఉండేలా ఏదైనా పెట్టాలి. తగినంత గాలి ఆడేలా చూడాలి. బలవంతంగా నీళ్లు త్రాగించేందుకు ప్రయత్నం చేయకూడదు. చేతిలో తాళాలు పెట్టడం ఇనుప వస్తువులు మెడలో వేయటం నోట్లో స్పూన్లు పెట్టడం చేయకూడదు. అటువంటివారిని వెంటనే దగ్గరలో ఉన్న హాస్పటల్ కి తీసుకువెళ్లాలి.

# మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి.




**కర్నూలు నంది పత్రిక.....** కరీంనగర్ జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం పై దాడి చేసిన మనువాద దుండగులను అరెస్టు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. కర్నూలు నందలి స్థానిక పూలే సర్కిల్ లో పూలే విగ్రహం పై దాడి సంఘటనను నిరసిస్తూ ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ సంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నక్కలమిట్ట శ్రీనివాసులు శేషఫణి,నంది విజయలక్ష్మీ , ఖధీరుల్లా, కెవిపిఎస్ ఆనందబాబు బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు భరత్ కుమార్ ఆచారి, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం పెట్టాలని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పూలే విగ్రహాన్ని కూలగొడుతూ కాళ్ళతో తన్ని అవమానించడం జరిగిన సంఘటన బహుజనుల ఆత్మగౌరవానికి సంబంధించినది అని వారి మనోభావాలను కించపర్చడమే అని వారు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను తొక్కి పెడితే , మహాత్మా జ్యోతిరావు పూలే శివాజీ మహారాజ్ చరిత్రను వెలికి తీసి, మొట్టమొదటి సారిగా శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించినది మహాత్మా జ్యోతిరావు పూలే అన్న వాస్తవ చరిత్రను తెలుసుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే పై దాడి చేయడం సిగ్గుచేటు అని వారు అన్నారు. పూలే విగ్రహం పై దాడి చేసి ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీల వర్గాలను అవమానించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మనువాదుల పై చట్టపరమైన చర్యలు చేపట్టి తక్షణమే అరెస్టు చేయాలని లేని పక్షంలో ఛలో తెల్లాపూర్ కు బహుజనులు పిలుపునిచ్చి తెలంగాణ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాచారం హక్కు చట్టం ప్రతినిధి జయన్న, బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు చిరంజీవి, పెరికల రంగస్వామి, కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున, కంది వరుణ్ కుమార్, సత్యనారాయణ మరియు బిఎస్పీ నాయకులు అరుణ్ కుమార్, రాజ్ కుమార్, మహిళా ఐక్య వేదిక నాయకులు వగ్గ ఈరమ్మ , కటికె భాను, పద్మావతి, ఎలీసమ్మ , కొమ్ము పెద్దక్క, అమీనాబీ,రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.




# నంద్యాల జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

## 19 సంవత్సరాల లోపు బాల బాలికల చదరంగం పోటీలు ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ




**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 8 ( నంది పత్రిక )** ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఆదివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి 19 సంవత్సరాల లోపు బాల బాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, సత్యసాయి జిల్లా క్రీడా అధికారి కిషోర్ చదరంగం బోర్డ్ పై పావులు కదిలించి లాంఛనంగా టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధాశక్తిని పదును పెడుతుందన్నారు.విద్యార్థులలో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందన్నారు. క్రీడల ద్వారా గెలుపు,ఓటములను స్వీకరించే ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు.గెలిచినవారు మళ్లీ గెలవాలని, ఓటమి చెందిన వారు నిరంతర సాధన ద్వారా భవిష్యత్తులో గెలుపు సాధించడానికి కృషి చేయాలని కోరారు. రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సత్యసాయి జిల్లా క్రీడా అధికారి కిషోర్, సత్య సాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మణికంఠ రెడ్డి, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, కోశాధికారి శ్రీనిష్ ,క్రీడాకారులు వారి శిక్షకులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీతో దీక్షలు విరమించిన సీ.పీ.ఐ పార్టీ నాయకులు



**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలులో రైల్వే సమస్యల పై సీ.పీ.ఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీతో విరమించారు... కర్నూలు నుంచి విజయవాడ కు ప్రతి రోజు ఇంటర్ సీటీ రైలును నడపడంతో పాటు, కాచిగూడ నుంచి గుంటూరు మీదుగా వెళ్లే ప్యాసింజర్ రైలు విజయవాడ దాకా పొదగించాలని, అలాగే విశాఖపట్నం నుంచి మహబూబ్ నగర్ కు వచ్చే రైలును కర్నూలు దాకా పొడగించాలంటూ నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సీ.పీ.ఐ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నారు..దీక్షా శిభిరానికి చేరుకున్న ఎంపీ నాగరాజు నిరసన చేస్తున్న నాయకుల తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు దీక్షలను విరమించారు...ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యల పై ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో చర్చించానని, మరో సారి మంత్రి తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు...

# నూతన ఎస్సైకి ఘన స్వాగతండ ప్రజా సమస్యల పరిష్కారానికి సూచించిన రవీంద్రారెడ్డి

**పోరుమామిళ్ల ఫిబ్రవరి 8 (నంది పత్రిక):** పోరుమామిళ్ల మండలానికి నూతన ఎస్సైగా నియమితులైన హనుమంతును ఆదివారం బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూడ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు శంకర్ రెడ్డి, గాలి మురళి, మౌలాలి, శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.



# టీ20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన ఆతిథ్య శ్రీలంక... ఐర్లాండ్‌పై ఘన విజయం

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంక గెలుపు బోణీ కొట్టింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆదివారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్, ఆ తర్వాత బౌలింగ్‌లో సమష్టిగా రాణించి టోర్నీలో శుభారంభం చేసింది. 164 పరుగుల లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌట్ అయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలినా, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (43 బంతుల్లో 56 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరి ఓవర్లలో కమిందు మెండిస్ (19 బంతుల్లో 44) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో లంక స్కోరు ఊపందుకుంది. వీరిద్దరి ప్రదర్శనతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది.

# రైతులు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి





## ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలి రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 8 నంది పత్రిక** వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలు రైతాంగం సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఉండి ఏఎంసీ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం ఐసిఏఆర్ భారతీయ వరి పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్ హైదరాబాద్ సంస్థ సౌజన్యంతో ఎస్సీ సబ్ ప్లాన్ కు సంబంధించి రూ.28 లక్షల విలువ గల బ్యాటరీ స్ప్రేయర్లను అందజేసే కార్యక్రమానికి రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ముఖ్య అతిథులుగా పాల్గొని, వారి చేతుల మీదుగా ఉండి నియోజకవర్గానికి చెందిన నాలుగు వందల మంది ఎస్సీ రైతులకు స్ప్రేయర్లను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురాం కృష్ణంరాజు మాట్లాడుతూ రైతులు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న రైతులకు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. అధునాతన పద్ధతిలో ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయ పనిముట్లు కూడా నూతన సాంకేతికతో ఉండాలని అందువల్లే ప్రభుత్వం వీటిని అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకు అన్ని రంగాల్లోనూ అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వ పథకాలు సబ్సిడీ పంటల భీమా వంటి వాటిపై మరింత అవగాహన కలిగి లాభసాటిగా అభివృద్ధి సాధించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సాంప్రదాయ సాగుతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ టెక్నాలజీ, పంటల నమోదు, మార్కెటింగ్ విలువ జోడింపు, సేంద్రియ వ్యవసాయం వంటి రంగాల్లో పరిజ్ఞానం పెంచుకొని ఆదాయం గణనీయంగా పెంచుకోవాలన్నారు.

ఎక్కడా లేని విధంగా ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా ఎస్సీ రైతులకు ఇంత పెద్ద ఎత్తున వ్యవసాయ పరికరాలు ఉచితంగా పంపిణీ చేయడానికి కృషిచేసిన రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘు రామకృష్ణ రాజుకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ అవకాశమును రైతులందరూ సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రతాప్ జీవన్, ఉండి ఆకివీడు మార్కెట్ యార్డ్ చైర్మన్లు కలిదిండి రామకృష్ణ రాజు, బొల్లా వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మల శ్రీనివాసరావు, రమేష్ నాయుడు, బి.సంధ్య, కరి మేరక నాగరాజు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





## జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం....



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి08(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు నంద్యాల పోలీసులు వాహానాల డ్రైవర్లకు "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు, ఇన్స్యూరెన్స్ వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ,ఆత్మకూరు, నంద్యాల, డోన్ సబ్ డివిజన్ లలోని నేషనల్ హైవేల లో లారీలు, ప్రవేట్ ట్రావెలింగ్ బస్సులు, ఆర్టీసి బస్సులు , కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరో వాహనాలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకూడదని, రాంగ్ రూట్ లో వెళ్ళకూడదని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదనిన పోలీసు అధికారులు ఆయా వాహనాల డ్రైవర్లకు తెలియజేస్తున్నారు.



## జిల్లాలోని రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి...**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి....**



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి08(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.



## 38 సంవత్సరాల అనంతరం కలుసుకున్న చాగలమర్రి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



**ఆళ్లగడ్డ (చాగలమర్రి )ప్రతినిధి ఫిబ్రవరి 8 నంది పత్రిక** చాగలమర్రిలో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. 38 ఏళ్ల క్రితం వీడ్కోలు పలికిన నేస్తాలు.. మళ్ళీ ఒక్కటయ్యారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకోవడంతో మిత్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్ననాటి ముచ్చట్లు, తరగతి గది జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. తమ ఎదుగుదలకు కారణమైన గురువులను మర్చిపోలేదు. వారికి పాదాభివందనాలు చేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జీవయ్యతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు కైప మధుసూదన్ శర్మ, శివారెడ్డి, కృష్ణయ్య, కర్నాటి వెంకటరెడ్డి, డ్రాయింగ్ టీచర్ నరసింహులు పాల్గొన్నారు. గురువుల ఆశీస్సులు తీసుకున్న విద్యార్థులు, పాఠశాల రుణం తీర్చుకుంటామని తెలిపారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు కరిముల్లా, మధు, కిరణ్ కుమార్, జిఎం భాష, చెలువయ్య, సత్యబాబు తదితరులు పాల్గొని.. నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు.



## బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా మరియు టౌన్ అధ్యక్షుల ఎన్నిక- ప్రకటన.



**బేతంచెర్ల ఫిబ్రవరి 8 ( నందిపత్రిక ).** బేతంచెర్ల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కార్యదర్శి నాగమోహన్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో బిజెపి కార్యాలయం నందు ఆదివారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బేతంచెర్ల టౌన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా టీచర్ ఎల్లయ్యను, బేతంచర్ల మండలం నుండి ఎస్సీ మోర్చా జిల్లా స్థాయికి జిల్లా ఉపాధ్యక్షుడిగా లెక్చరర్ రాజును ప్రకటించడం జరిగింది. పార్టీ అభివృద్ధి కోసం తోడ్పడాలని గణేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణ,టౌన్ కార్యదర్శి టైలర్ రాముడు,సముద్రాల మణికంఠ,గోవిందు,సురేష్,యువ నాయకులుమోహన్ రావు,ఉపేంద్ర, బాలరాజు,ధర్మారెడ్డి,భాస్కర్ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 08(నంది పత్రిక):-** నేడు (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

## టీమిండియా ఆటగాళ్లకు తన నివాసంలో విందు ఏర్పాటు చేసిన గంభీర్

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, టీ20 వరల్డ్ కప్‌లో శుభారంభం చేసిన టీమిండియాకు తన నివాసంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశాడు. అమెరికాపై తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన అనంతరం, ఢిల్లీకి చేరుకున్న జట్టుకు ఆదివారం రాత్రి ఈ డిన్నర్ ఇచ్చాడు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 7న ముంబై వాంఖడే స్టేడియంలో అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 29 పరుగుల తేడాతో గెలిచింది. ఈ విజయంతో టోర్నీని ఘనంగా ప్రారంభించిన సూర్యకుమార్ యాదవ్ సేన, తమ తదుపరి మ్యాచ్ కోసం ఢిల్లీకి చేరుకుంది. ఫిబ్రవరి 12న అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో భారత్ తలపడనుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోనే నివాసముంటున్న గంభీర్, జట్టుకు తన ఇంట్లో ఆతిథ్యం ఇచ్చాడు. ఆటగాళ్లు, సహాయక సిబ్బందిని తన కుటుంబ సభ్యులతో కలిసి సాదరంగా ఆహ్వానించాడు. కోచ్‌గా గంభీర్ జట్టుకు ఇలా డిన్నర్ ఇవ్వడం ఇది రెండోసారి. గతంలో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు కూడా ఢిల్లీలో మ్యాచ్‌కు ముందు విందు ఇచ్చాడు.

# నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వం చంద్రబాబునాయుడు దే.





## ఎమ్మెల్యే గిత్త జయ సూర్య., టిడిపి యువ నాయకులకు గౌరు జనార్దన్ రెడ్డి.

నందికొట్కూరు ఫిబ్రవరి8( నంది పత్రిక ) నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ నందు గౌర వెంకట్ రెడ్డి,మండ్రా శివానందరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిరుద్యోగులకు అమర్ రాజా కంపెనీ మెగా జాబ్ మేళా కార్యక్రమని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరితమ్మ తనయుడు టిడిపి యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మెగా జాబ్ టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం లో ప్రజల కోసం నిరుద్యోగ యువకుల కోసం పాటుపడిన కుటుంబాలు గౌరవ మరియు మండ్రా కుటుంబాలతో పాటుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య అని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే నియోజవర్గ ప్రజల యొక్క సంక్షేమం మరియు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమేనని అనవసరంగా యువకులను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం కాదన్నారు. నియోజవర్గంలో మాండ్రా, గౌరు నాయకత్వంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడని, మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వ సహాయం కోరిన పేదలకు ప్రభుత్వం నుండి సీఎం సహాయ నీది అందించి స్వయాన ఇంటికి వెళ్లి చెక్కులు అందజేస్తున్న పరిస్థితి నియోజకవర్గంలో కొనసాగుతుందన్నారు. అలాంటి మంచి నాయకుడు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అని వారు కొనియాడారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు సంపాదించు కోవడానికి పనిచేశారని, నేడు మాండ్ర గౌరు కుటుంబాల నాయకత్వంలో ప్రజల ఆకాంక్ష మేరకు నియోజవర్గ ప్రజల అభివృద్ధి మరియు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అలాంటి నాయకత్వాన్ని ఎన్నుకున్న ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ మండ్ర, గౌరు ల ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం పరితపించే పరంపరాను నేడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న పరిస్థితి మెగా జాబ్ మేళ నిర్వహించడం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి అవకాశాలు సీఎం చంద్రబాబు, నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో చేస్తున్న కృషి కొనియాడాదాగినందన్నారు. మెగా జాబ్ మేళాలో హాజరైన నిరుద్యోగులకు జాబ్ అపాయింట్మెంట్ పత్రాలను ఎమ్మెల్యే గిత్త మరియు గౌరు జనార్దన్ రెడ్డిలు నిరుద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మండల సురేంద్ర నాథ్ రెడ్డి, వ్యవసాయ సహకార పరపతి సొసైటీ చైర్మన్ ముర్తుజవాలి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, పట్టణ మహిళా నాయకురాలు డాక్టర్ వనజ, టిడిపి యువత నియోజవర్గ అధ్యక్షులు ప్రభు కుమార్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి,చిన్నరాజు, మిడ్తూర్ మండల నాయకులు ఖాతా రమేష్ రెడ్డి, పగిడాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షకీల్ అహ్మద్ ,నాయకులు పగడం సోమశేఖర్, గోవర్ధనగిరి, భరత్ రెడ్డి, కళాకర్, మల్లికార్జున్రెడ్డి, నూర్ అహ్మద్, రసూల్ ఖాన్, మరియు మండల నాయకులు కార్యకర్తలు నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాలలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్

### 12 మంది మైనర్లకు కౌన్సిలింగ్, 60,000/- జరిమాన....

### రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ప్రజల రక్షణ కోసమని గుర్తించాలి...

### నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ భాష



నంద్యాల క్రైం, ఫిబ్రవరి08(నంది పత్రిక):– రహదారి ప్రమాదాలను నివారించడమే లక్ష్యంతో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ బాషా గారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు పట్టణ కేంద్రంలో మైనర్లు వాహనాలు నడపడం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా 12 మంది మైనర్లు చట్టవిరుద్ధంగా టూ వీలర్స్ వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి, ఒక్కొక్కరికి 5,000/– రూపాయల చొప్పున 60,000/– జరిమాన విధించడంతో పాటు వారిని తల్లిదండ్రులు, సంరక్షకులను స్టేషన్ వద్దకు పిలిపించి రహదారి భద్రత, మైనర్ల వాహన నడపడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలు మరియు బాధ్యతగల పర్యవేక్షణ అవసరంపై అవగాహన కల్పించారు. మరియు మైనర్లకు ట్రాఫిక్ నియమాలు మరియు సురక్షిత డ్రైవింగ్ పద్ధతులపై ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం జరుగుతూ ఉంటాయి. కావున ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని కోరుకోవడం తోపాటు ఇవన్నీ ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా రక్షణ కోసమేనని గుర్తించి పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది.

## డ్రోన్ ద్వారా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులు అరెస్ట్

### బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు: పట్టణ సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 8, నంది పత్రిక నేరాల నియంత్రణలో భాగంగా బహిరంగ మద్యపానాన్ని కట్టడి చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ ల సహాయంతో వివిధ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేయడం జరుగు తుంధని ఆళ్లగడ్డ పట్టణ సి ఐ యుగంధర్ తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు పట్టణ పరిధిలోని వివిధ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేందుకు అవకాశం ఉన్న పలు ప్రాంతాలను ఆదివారం డ్రోన్ లతో జల్లెడ పట్టామన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు డ్రోన్ ద్వారా గుర్తించి అక్కడికి వెళ్లి వారిని పట్టుకోవడం జరిగిందన్నారు. బహిరంగంగా మద్యం సేవించడం నేరమని, ప్రజా భద్రతకు భంగం అని వారికి తెలిపి వారిపై బహిరంగ మద్యపానం చేసినందుకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్–పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం నాడు రౌడీషీటర్లకు పట్టణ సీఐ యుగంధర్ కౌన్సిలింగ్ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మానుకోవాలని సూచించారు. ఒక మారు పోలీసు రికార్డుల్లో పేరు నమోదు అయితే రౌడీ షీటర్లుగా ముద్ర పడిపోతారని అది కుటుంబం పైన కూడా మచ్చ ఉంటుందని కనుక రౌడీ రౌడీ షీటర్లునేర ప్రవృత్తిని వదులుకోవాలని సమాజంలో మంచిగా ఉండాలని సీఐ తెలిపారు. పట్టణ ఎస్ఐలు షేక్ నగీన శ్రీనివాసగౌడ్, సిబ్బంది కోటేశ్వరరావు ఉదయ్,

## మహాశివరాత్రి పండుగకు భక్తులకు/ పాదాచారులకు పోలీసు వారి సూచనలు....

### ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్



నంద్యాల క్రైం, ఫిబ్రవరి08(నంది పత్రిక):– మహాశివరాత్రి పండుగ సందర్భముగా, ఆత్మకూరు నుండి దోర్నాల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ ను నియంత్రించుట కొరకు, 09.02.2026 వ తేదీ నుండి కర్నూలు నుండి విజయవాడ వైపు వెళ్ళు భారీ గూడ్స్ వాహనములను దోర్నాల మీదుగా అనుమతించబడవని ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ అన్నారు... ఆదివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. భారీ వాహనములు నంద్యాల మీదుగా వెల్లవలెనని, అదే విధముగా విజయవాడ నుండి కర్నూలు వైపు వచ్చే భారీ గూడ్స్ వాహనములు దోర్నాల – ఆత్మకూరు మీదుగా అనుమతించబడవని, సదరు వాహనములు గిద్దలూరు, నంద్యాల మీదుగా వెల్లవలెను అని అన్నారు. శ్రీశైలంకు కాలినడకన వెళ్ళు భక్తులు రోడ్డుకు ఒక వైపున మాత్రమే వెల్లవలెనని, పాదచారులు జేబుదొంగల పట్ల అప్రమత్తముగా ఉంటూ, వారి యొక్క వస్తువులను మరియు లాగేజీ ని జాగ్రత్త చూసుకొనవలెనన్నారు. గూడ్స్ వాహనముల యందు మనుషులు అనుమతించబడరు మరియు వాహనాల యందు ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణించరాదని, వాహన దారులు నిర్దేశించిన వేగముతో వెల్లవలెను. అతివేగముతో ప్రయాణించరాదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పోలీసు వారికి సహకరించవలెను. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిచిన యెడల మోటార్ వాహనాల చట్టప్రకారం చర్య తీసుకొనబడును అని తెలిపారు. వాహన డ్రైవరు లు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, వెంకటాపురం వరకు వాహనములలో వచ్చి, కాలినడకన వెళ్ళు భక్తులు, వారి యొక్క వాహనములను రోడ్డు పై ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేయకుండా, వెంకటాపురం వద్ద వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశం నందు ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా పోలీసు వారికి సహకరించవలెనన్నారు. చిన్నపిల్లలతో పాటు కాలినడకన వెళ్ళే వారు, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వారు తప్పిపోకుండా చూసుకోవలెనని, భక్తులు అడవిలో ప్రయాణించేటప్పుడు అటవీ పరిసరాలకు ఎటువంటి హాని తలపెట్టరాదదని, భక్తులు అటవీ మార్గములో ప్రయాణించేటపుడు వన్య ప్రాణులకు హాని తలపెట్టకుండా, జంతువుల నుండి అప్రమత్తముగా ఉండవలెనన్నారు. అటవీ మార్గములో ప్లాస్టిక్ వస్తువులు అనుమతించబడవు అని తెలిపారు.

## జ్ఞాపక శక్తిని పెంచే ఫుడ్స్



మంత్రాలయం పిబ్రవరి08 (నందిదినపత్రిక ప్రతినిధి) బ్లూబెర్రీస్ లోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలను రక్షించి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగు పరుస్తాయి. చేపలు,సాల్మన్, ట్యూనా, సార్డిన్స్ వంటి చేపలలోని ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెదడుపనితీరు,వయస్సుతో వచ్చే జ్ఞాపకశక్తి సమస్యలను నివారిస్తాయి. గుడ్లు,గుడ్లలోని కోలిన్ జ్ఞాపకశక్తికి కారణం అయ్యే ఎసిటైల్కోలిన్ అనే రసాయనాన్ని ఉత్పత్తి చేయును. అవకాడోలో మెదడుకు మంచి కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బాదంపప్పు, బాదంపప్పులో విటమిన్ ఈ, ఒమేగా మూడు కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి మెదడు పనితీరు మెరుగుపరస్తుంది. తేనెలో యాంటీఆక్సిడెంట్లు,మెదడు కణాలను రక్షిస్తుంది. డార్క్ చాక్లెట్ లో ఫ్లేవనోల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు మెదడు పనితీరు మెరుగు పరచును. బ్రోకలీ,బ్రోకలీలో విటమిన్ కే, చోలిన్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి మెదడు ఆరోగ్యానికి మంచివి. పసుపు, పసుపులో కర్కుమిన్ మెదడు కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది, జ్ఞాపకశక్తి మెరుగుపరుస్తుంది. గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు, యల్థోయానిన్ అనే అమైనో ఆమ్లం పుష్కలంగా ఉండి మెదడు పనితీరు మెరుగు పరుస్తాయి. జ్ఞాపక శక్తిని దెబ్బతీసే ఆహారాలు. ఎక్కువ ఉప్పు మరియు నూనె ఉన్న ఆహారాలు, వీటిని ఎక్కువగా తినడం రక్తప్రసరణకు దెబ్బతీస్తుంది, దీనివలన మెదడుకు వచ్చే రక్తప్రవాహం తగ్గుతుంది. కెఫిన్ డ్రింక్స్, కూల్ డ్రింక్స్ వీటి అధిక సేవనం మానసిక శక్తిని తగ్గిస్తాయి. ఎక్కువ చక్కెర ఉన్న ఆహారాలు, వీటిని ఎక్కువగా తినడం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచి, జ్ఞాపకశక్తి, ఆలోచన సామర్థ్యం తగ్గిపోతాయి. అధిక కొవ్వు ఉన్న ఆహారాలు ఇవి రక్తప్రవాహానికి అడ్డంకిగా ఉంటాయి, దీనివలన మెదడుకు పోషకాల తగ్గుదల కలుగుతుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్ లో పోషకాలు తక్కువ, హానికరమైన పదార్థాలు ఎక్కువ. మెదడు పనితీరు దెబ్బతింటుంది. మద్యపానం, ఇది నరాల కణజాలాల నష్టానికి, రక్తప్రసరణ సమస్యలకు దారితీస్తుంది. నిద్రలేమి, ఇది మెదడు శక్తులకు హానికరం. తగినంత నిద్ర పట్టకపోతే జ్ఞాపకశక్తి మందగిస్తుంది. మానసికంగా, శారీరకంగా అధిక శ్రమవేసే పనులు వీటివల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరుగుతుంది, దీనివల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

## 12న సమ్మెను జయప్రదం చేయండి... వ్యాకాస



జూపాడుబంగ్లా: ఫిబ్రవరి: 8: (నంది పత్రిక) లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఉపాధి కూలీలకు కరపత్రాలు ఎం కర్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం. కర్ణ మాట్లాడుతూ లేబర్ కోర్స్ కార్మికులకు ఉరితాలుగా మారుతున్నాయని తెలిపారు. లేబర్ కోర్స్ అమలు అయితే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వర్యం అవుతాయని అన్నారు. ఎనిమిది గంటల పని 10 గంట పని అమలు లోకి వస్తుందిన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని కార్మిక సంఘాలను విచ్చిన్నం చేస్తారని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి అయిన చట్టాన్ని కొనసాగించాలని పది దినాలు రోజులు 200 రోజులు పెంచాలని అన్నారు. శ్రామికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. రోజువారి కూలీ 700 రూపాయలు ఇవ్వాలి. భారత కార్మికోద్యమం 1925 నుండి అనేక పోరాటాలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి చేసింది... విజయం సాధించింది కానీ శతాబ్దాల కాలం పాటు శ్రామికులు శ్రమించే సాధించుకునే హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వం మొత్తం 44 కార్మిక చట్టాలను నాలుగు కోట్లుగా కుదించింది. బ్రిటిష్ పాలనలో పోరాడి ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రతిష్టత్మకంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమ్మ, దానమ్మ,మరిగమ్మ, వ్యవసాయ శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు

## హృదయంలో దీపశిఖలా ఉంటారు అమ్మవారు

### -మునిమానసహంసికా అమ్మవారి అద్భుతనామం.



మంత్రాలయం పిబ్రవరి 08 (నందిదినపత్రిక ప్రతినిధి) ఈనామం అర్థం మునుల మనస్సనే మానస సరోవరం నందుండు ఆడుహంస అని భాష్యం చెప్పారు. అమ్మవారు అన్నారు నాహం తీర్థే, నకైలాసే, వైకుంతేవా నకర్హచిత్ అని అంటే తీర్థాల్లోనో, కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉండను నేను అని. ఋషులు అడిగారు. వసామి కింతు? అంటే మరెక్కడ ఉంటావమ్మా అని. మత్ జ్ఞాని హృదయాం భోజమధ్యమే అంటే జ్ఞానుల హృదయాలలో ఉంటారని తెలియచేసారు అమ్మవారు. జడులు, అజ్ఞానులుగుడిలోని లింగాన్ని ఎలా చూడగలుగు తారో జ్ఞానులు తమ హృదయంలో ఉన్న జ్యోతిర్లింగాన్ని అంతే స్పష్టంగా చూడగలుగుతారు. "బ్రహ్మ సత్యం, జగన్మిధ్య " అన్నారు శంకరులు. అది తెలుసుకోవడమే జ్ఞానం. మునుల మనస్సు మానస సరోవరంలా స్వచ్ఛంగా ఉంటుంది. దానిలో అమ్మ వారు హంసలా ఉంటారు. హంస తెల్లగా ఎంత స్వచ్ఛంగా ఉంటుందో అందరికీ తెలుసు. శ్రీసూక్తంలో అమ్మవారిని ప్రార్థిస్తూ లోకైక దీపాంకురాం ( లోక+ఏక+దీప+అంకురాం ) అంటాం అంటేలోకాలన్నింటికీ ఒకే ఒక్క దీపంగా ఉన్నదని, దీపం అంటే జ్ఞానం. లక్ష్మీదేవి జ్ఞానప్రదాత. చీకటి పోవాలంటే దీపం కావాలి. అజ్ఞానాంధ కారం పోవాలంటే దీపలక్ష్మి అనుగ్రహం కావాలి. అమ్మ వారు దీపశిఖలా ఉంటారు. హృదయంలో. అజ్ఞానం, మాయ, మసి ఆవరించి ఉండడంవల్ల కనిపించదు. మాయ తొలగుతే అంతా ఆనందమే.

## అష్టాదశ శక్తిపీఠాలు



మంత్రాలయం పిబ్రవరి 08 (నందిదినపత్రిక ప్రతినిధి) 18 శక్తి పీఠాలలో 1. శ్రీశైలం, 2. పిఠాపురం, 3.ద్రాక్షారామం, 4.అలంపురం, 5.కాంచీపురం, 6.మధురై, 7.వారణాసి, 8ప్రయాగ, 9.గయ, 10.గౌహతి, 11.మైసూరు, 12.మహూర్ గడ్, 13.ఉజ్జయిని, 14. కొల్హాపూరు 15. జాజ్ పూర్ (ఒరిసా)దర్శించడం జరిగింది. 12(14) జ్యోతిర్లింగాలు కూడా దర్శించుకోవడమొకఅదృష్టం. శృంఖలాదేవి దర్శనం చేసుకుందామని ప్రయత్నించి నాసరి అయిన ప్రదేశగుర్తులు దొరకక కుదరలేదు. 18లో మూడు శక్తి పీఠాలు గుర్తించ లేకుండా ధ్వంసమయ్యాయని చదివినా శృంఖలాదేవి గుడి ఒక మసీదు దగ్గర గోడలో నిక్షిప్తమైందని తెలిసినా కలకత్తా నగరములో ఉండి కలకత్తా కాళికా దేవిని, దక్షిణేశ్వరు కాళికను, జాజ్ పూర్ గిరిజా మాతను కారులో తిరిగి దర్శనం చేసుకున్నా శృంఖలా. దేవి అనుగ్న దొరకలేదేమో. జ్వాలా ముఖిని దర్శించుకోవడము మిగిలిఉంది. కాశ్మీరులోని సరస్వతి అమ్మవారు, కాశ్మీరులో ధ్వంసమై గుర్తులు కూడా లేకుండా ఉన్నదని తెలిసింది. శ్రీలంక శాంకరీదేవి దర్శనం కూడా అవుతుందో లేదో అనుమానమే. ద్రాక్షారామం గుడి జీర్ణదశకు దగ్గరగా ఉండటం, పాలకుల నిర్లక్ష్యం బాధ అనిపించింది. మిగతా గుడులన్నీ బాగానే ఉన్నాయి.

## నోబెల్ గ్రహీతకు జైలు శిక్ష విధించిన ఇరాన్

ఇరాన్లో మహిళల హక్కులు, మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ కార్యకర్త, 2023 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గిస్ మొహమ్మదీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అక్కడి న్యాయస్థానం ఆమెకు 6 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారన్న ఆరోపణలపై ఈ తీర్పు వెలువరించింది. ఆమె న్యాయవాది మొస్తఫా నిలి ఈ వివరాలు వెల్లడించారు. నేరాలు చేయడానికి సమూహంగా ఏర్పడ్డారన్న అభియోగంపై ఆరేళ్ల జైలు శిక్ష విధించారని తెలిపారు. దీనితో పాటు ప్రభుత్వ వ్యతిరేక ప్రచార కార్యకలాపాలకు సంబంధించి మరో ఒకటిన్నర సంవత్సరాల శిక్ష కూడా పడింది. అయితే, ఇరాన్ చట్టాల ప్రకారం ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయి. శిక్షాకాలం పూర్తయ్యాక రెండేళ్ల పాటు దేశం విడిచి వెళ్లరాదని, మరో రెండేళ్ల పాటు సౌత్ ఖొరాసాన్లోని ఖోస్ఫ్ నగరంలో బహిష్కరణ శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. 53 ఏళ్ల నర్గిస్ మొహమ్మదీ గత 25 ఏళ్లుగా ఇరాన్లో మరణశిక్షకు, మహిళలపై తప్పనిసరి హిజాబ్ నిబంధనకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం జైలులోనే గడిపారు. జైలులో ఉండగానే గత ఏడాది ఆమె ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. ఆమె తరఫున, పారిస్లో ఉంటున్న ఆమె కవల పిల్లలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనారోగ్య కారణాలతో గత డిసెంబర్లో మూడు వారాల పాటు తాత్కాలికంగా విడుదలైన ఆమెను, తర్వాత మళ్లీ అరెస్టు చేశారు. తాజా తీర్పు ఇంకా తుది కాదని, దీనిపై అప్పీల్ చేస్తామని ఆమె న్యాయవాది తెలిపారు. నర్గిస్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆమెకు బెయిల్ లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# చరిత్ర మరచిన వీరనారి తిమ్మమాంబ.

**-దైవందిన్నె సంస్థానానికి వన్నె తెచ్చిన ఆడపడుచు.**

**-గుజ్జువంశస్థుల ఆడబిడ్డకు దైవందిన్నెలో ఆలయం.**

మంత్రాలయం పిబ్రవరి07. (నందిదినపత్రిక ప్రతినిధి) అలనాటి చారిత్రక ఆనవాళ్లు కాలగర్భంలో కరిగిపోతూ ఉన్నాయి. నాటి రాచరిక వ్యవస్థ భవిష్యతరాలకు స్ఫూర్తి కల్పించాలంటే నాటి పాలకుల ప్రజారంజక పాలన, రైతు సంక్షేమంపై చేపట్టిన చర్యలు, భారతీయ కళలు అంతరించి పోకుండా ఆపాలకులు ఆదరించిన కళాపోషణ,ఆపత్సమయలో వారి వీరోచిత యుద్ధ విద్యల నైపుణ్యాలు, వారి పాలనలో రూపుదిద్దుకొని వికశించిన ఆధ్యాత్మిక ఆలయాలు, సహచర రాజులతో వారి సన్నిహిత సంబంధాలు తదితరాలపై భావితరాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చరిత్ర పుటల్లో నాటి వైభవాలకు చోటు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నది నగ్న సత్యం. మహారాజులే కాదు మహారాణులు సైతం రాజ్యాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారన్న నగ్నసత్యాలను తెలుగు ప్రజల ముంగిళ్ళకు తీసుకు రావాలనే ఆలోచనే ఈకథనం. ఆడపిల్ల ఆమబల కాదు ఆగ్రహిస్తే అపరకాళిలా మారి ప్రతీకారం తీర్చు కుంటుందని ఒక తెలుగింటి రాజపడుచు 800 సంవత్సరాలకు పూర్వమే రుజువు చేసింది. ఆమే వేరెవ్వరో కాదు నేటి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలపరిధిలోని దైవందిన్నె సంస్థానం రాకుమారి తిమ్మమాంబ. భర్త హత్యకు ప్రతీకారంగా గోల్కొండ నవాబు సైన్యాధ్యక్షుని తల నరికిన వీరనారి ఆమె. భర్త మృతదేహంతో పాటు సహగమనంచేసి కన్నవారింటి ఇలవేల్పుగా వెలసిన ధీర వనిత. దైవందిన్నె సంస్థానం:- గోల్కొండ నవాబులు పరిపాలిస్తున్న సమయంలో ప్రస్తుత ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని దైవందిన్నె గ్రామం నాడు ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన రాజసంస్థానం. ఈసంస్థానాన్ని గుజ్జు వంశస్తుడైన పెద్దారెడ్డి భూపతి పాలించేవాడు. ఈయన సతీమణి మల్లాంబ.ఈరాజ దంపతులకు చాలాకాలం వరకు సంతానం కలుగలేదు. సంతానప్రాప్తి కొరకుతమ రాజగురువునుఆశ్రయించారు రాజదంపతులు.రాజదంపతులకు సంతాన యోగం ఉందని మొదటిసంతానంగాబాలుడు, రెండవ సంతానంగా బాలిక జన్మిస్తారని వీరిలో బాలిక అనన్య ప్రతిభాపాటవాలతో వీరకాంతగా, వీరపత్నిగా, వీరమాతగా వాసికి ఎక్కు తుందని మునీశ్వరుడు సెలవిచ్చి రాజదంపతులను ఆశీర్వదించారు. ఆముని ఆశీర్వాదంతో ఆరాజ దంపతులకు మొదట నాగిరెడ్డి అనుకుమారుడు జన్మించాడు. రెండవ సంతానంగా తిమ్మాంబ జన్మించింది. మౌనీశ్వరుని ఆశీర్వాదంతో తిమ్మమాంబ విద్యాబుద్ధులతో రాణిస్తూనే యుద్ధవిద్యల్లోనూఆరితేరింది. 16సంవత్సరాల వయస్సు లోనే తిమ్మమాంబ అపూర్వ సౌందర్యరాశిగా ఎదిగింది. ఆమెకు యుక్తవయస్సు రావటంతో పెద్దారెడ్డిభూపతి ప్రస్తుత నందికొట్కూరు సమీపంలోని సాథాన్ కోట ప్రభువు చంద్రశేఖరరెడ్డితో వివాహం జరిపించారు. వివాహానంతరం తిమ్మాంబ సాథాన్ కోటకు వెళ్ళింది చంద్రశేఖరరెడ్డి, తిమ్మాంబ దంపతులకు రామచంద్రారెడ్డి జన్మించాడు. సాథాన్ కోటను చుట్టుముట్టిన కరువు కాటకాలు:-వర్షాభావ పరిస్థితులు చుట్టు ముట్టడంతో సాథాన్ కోట రాజ్యం కరువుకాటకాలతో విలవిలలాడింది. ఈకారణంగా రాజ్యంలోని ప్రజల నుంచి పన్నులు కట్టించుకోవడం ఆపేశాడు. ఖజానాలోని ధనాన్ని ప్రజలను ఆదు కొనేందుకు వినియోగించారు. దీంతో గోల్కొండ నవాబుకు సకాలంలో కప్పం చెల్లించలేక పోయాడు. దీంతోఆగ్రహించిన నవాబు సాతానుకోటరాజు నుంచి కప్పం వసూలు చేసుకు రావాలని మంత్రి ఖాధర్ ఖాన్, ఈయన కుమారుడైన సేనాపతి వల్లీఖాన్ లను ఆదేశించారు. వారితోపాటు నవాబు సైతం సాథాన్ కోటకు బయలు దేరారు. వీరి రాకను స్వాగతించిన రాజు చంద్రశేఖరరెడ్డి రాజ్యంలో కరువుకాటకాలు వివరించి కప్పం చెల్లించే వరకు సాథాన్ కోటలోనే ఉండమని సేనాధిపతిని ఆదేశించిన నవాబు గోల్కొండకు వెళ్ళి పోయారు. కప్పం పేరుతో సేనాపతి సాథాన్ కోటలో బిచాణా:- ఒకరోజు మంత్రి కోరిక మేరకు రాజు చంద్రశేఖరరెడ్డి కోటలోని సైన్యంతో వేటకై అడవికి వెళ్ళారు. కోటలో ఒంటరిగా ఉన్న గోల్కొండ సేనాపధిపతి వలీఖాన్ శిరోభారంతో ఉద్యానవనంలోకి వెళ్ళాడు. అక్కడ పువ్వులు కోస్తున్న అపురూప సౌందర్యరాశి అయిన రాణి తిమ్మమాంబను సేనాపతి చూసి మతి భ్రమించిన వలీఖాన్ రాణిని చేరుకోబోగా ఆమే తీవ్రంగా మందలించి కోటకు వెళ్ళి పోయింది. కోటలో తన చెలికత్తెను పిలిచి నవాబుకు చెల్లించేందుకు కప్పం డబ్బు తీసుకువచ్చేందుకు తాను దైవందిన్నె సంస్థానానికి వెళు ళ్తున్నానని రాజు వేట నుండి రాగానే ఈవిషయం తెలియజేయాలని చెప్పి రాణి తిమ్మమాంబ వెళ్ళిపోయింది. మధోన్మత్తుడైన వలీఖాన్ కోటకు చేరుకొని తిమ్మమాంబ ఆచూకీ చెప్పకపోతే చంపేస్తా నని బెదిరించాడు. దీంతో భయపడిన చెలికత్తె రాణి దైవందిన్నెకు వెళ్ళిందని చెప్పింది. అదివిన్న వలీఖాన్ వెంటనే దైవందిన్నెకు వెళ్ళి తిమ్మాంబనుతీసుకురావాలని లేదంటే నిన్ను చంపేస్తానని చెప్పడంతో బెదిరిపోయిన చెలికత్తె దైవందిన్నెకు వెళ్ళి పోయింది. ఇదేమీ తెలియని రాజు చంద్రశేఖరరెడ్డి వేట బడలికతో కోటకు రాగానే అలసిపోయి నిద్రపోయాడు. చంద్రశేఖరరెడ్డిని హత్యచేసిన వలీఖాన్. ఉద్యానవనంలో జరిగిన సంఘటనను తిమ్మాంబ రాజుకు చెబితే తనకు చావు తప్పదని భావించిన వలీఖాన్ రాణి వచ్చేలోగానే రాజును చంపితే చాలు ఇటు రాజ్యంతో అటు రాణి కూడా తన వశం అవుతుందని భావించాడు. అనుకున్నదే తడువుగా నిద్రిస్తున్న రాజుచంద్రశేఖర రెడ్డిని వలీఖాన్ హత మార్చాడు. దీన్ని గమనించిన చంద్రశేఖరరెడ్డిమంత్రి రాజు మృతదేహాన్ని రహస్యంగా నూనె పాత్రలో భద్రపరచి దైవందిన్నె సంస్థానానికి వెళ్ళిపోయిడు. అంతకంటే ముందుగానే దైవందిన్నెకు చేరుకొన్న చెలికత్తె పెద్దారెడ్డికి సమాచారం చేరవేసి వెళ్ళి పోయింది. దైవందిన్నెకు చేరుకొన్న మంత్రి రాజు పెద్దారెడ్డికి జరిగిన సంఘటన చేరవేశాడు. ఈవిషయాన్ని తిమ్మమాంబకు తెలియనీయ కుండా ఆమెతో కలిసి సాథాన్ కోటకు చేరుకున్నారు. అక్కడ చెలికత్తె ద్వారా భర్త హత్యో దంతం తెలుసుకొన్న తిమ్మమాంబ ఉగ్రరూపంతో గదిలో దాక్కున్న వలీఖాన్ ను పరుషపు మాటలతో గది బయటకు వచ్చేలా చేసింది. గది బయటకు రాగానే వలీఖాన్ తలను ఒక్క వేటుతో తెగనరికేసింది. భర్త మృతదేహంతో

**సహగమనం:**-తన భర్త మృతదేహంతోపాటు తానూ సహగమనం చేస్తానని తీమ్మమాంబ తండ్రి పెద్దారెడ్డి అనుమతి కోరింది. అందుకాయన ఒప్పుకోక పోవడంతో తాను తన భర్త మృతదేహం చెంత పడు కుంటాను వెంటనే ప్రాణం పోతేసరి లేదంటే పక్కకు తీయమని కోరడంతో తండ్రి సరేనన్నాడు. క్షితిపై భర్త మృతదేహం పక్కన పడుకోగానే తిమ్మమాంబ మరణించింది. జరిగిన సంఘటనతో శోకతప్త హృదయాలతో సంస్కారాలు నిర్వహించిన తర్వాత రామచంద్రారెడ్డికి పట్టాభిషేకం నిర్వహించాడు పెద్దారెడ్డి భూపతి. స్వప్నంలో తల్లిని తట్టి లేపిన తిమ్మమాంబ:- సాతాన్ కోటలో జరిగిన విషయాలు తెలియని తిమ్మాంబ తల్లి గాఢనిద్రలో ఉండగా ఎవరో తనను తట్టి లేపినట్లు కలగంది. కలలో తననగలను దైవందిన్నె సంస్థానంలోని శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి మూర్తులకు అలంకరించేందుకు సాథాన్ కోట నుంచి తలారికి ఇచ్చిపంపగా ఆతలారి ఆనగలను కాజేయాలని దైవందిన్నె సమీపంలోని కంపాడు గ్రామం దగ్గర ఉన్న నల్లవంకలో ఫలానా స్థలంలో పూడ్చి పెట్టడం వల్ల తలారి మరణించాడని ఆనగలను తెప్పించి దేవిడీలోని అలయానికి కానుకగా ఇవ్వాలని తిమ్మాంబ తల్లిమల్లాంబను కోరింది. కల నుంచి మేల్కొన్న మల్లాంబ భజాలు చూసు కోగా భుజంపై నూనె గుర్తులతో చేతి అచ్చులు గమనించిన మల్లాంబ సేవకుడిని నల్లవంకకు పంపి వంకలో తలారి పడిన ప్రాంతంలో ఇసుక తవ్వి అక్కడ దాచిన నగలను దేవిడీలోని ఆలయానికి అందజేసింది మల్లాంబ. గుజ్జు వంశంలో వంశస్తుల ఇళ్ళలో వివాహాలు జరిగేముందు వధూవరుల పట్టుపీతాంబ రాలు, పుస్తెలు, కాలిమెట్టెలు నాసన్నిధిలో ఉంచి పూజలు చేయాలని, మనవంశంలో పుట్టేపిల్లలకు పాలుపట్టే గరిటను, ఉయ్యాలను కొనరాదని అలా చేయడంవల్ల మేలు జరుగుతుందని తిమ్మాంబ తల్లికి వరం ఇచ్చింది. వీరనారి తిమ్మాంబకు దైవందిన్నెలో ఆలయం:- వీరనారిగా, వీరపత్నిగా, వీరమాతగా విశిష్టతను సంతరించుకొన్న తిమ్మమాంబకు దైవందిన్నెలో ఆలయం నిర్మించి గుజ్జు వంశస్థులు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతియేటా ఏప్రిల్ మాసంలో దైవందిన్నె దేవిడీలోని శ్రీలక్ష్మివెంకటేశ్వర స్వామికి తిమ్మమాంబ కానుకగా ఇచ్చిన నగలను అలంకరించి రథోత్సవం నిర్వహిస్తున్నారు. ఇంతటి విశిష్టత సంతరించుకొన్న తిమ్మమాంబను చరిత్రకారులు మరచిపోవడం బాధాకరం. గతంలో సుమారు 50 సంవత్సరాల క్రితం దైవందిన్నెలో సురభికంపెని ఆధ్వర్యంలో వీరతిమ్మమాంబ నాటకం ప్రదర్శించడం గమనార్హం. ఈవీరతిమ్మాంబ మాఇంటి ఆడపడుచు. మా ఇళ్ళలో వివాహాల సమయంలో వధూవరుల పట్టబట్టలను వీరతిమ్మాంబ ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించిన తర్వాత ఆపట్టు బట్టలను వధూవరులకు ఇవ్వడం జరుగుతోంది.

# సప్త చిరంజీవులు.



మంత్రాలయం పిబ్రవరి8. (నందిదినపత్రిక ప్రతినిధి) అశ్వత్థామ :-ద్రోణాచార్యుని కుమారుడు. మహాభారత యుద్ధానంతరం మిగిలిన దుర్యోధనుని పక్షపు వీరులలో ఒకడు. 2.బలిచక్రవర్తి :-ప్రహ్లాదునికి కుమారుడైన విరోచనుని కుమారుడు. ఇంద్రునిజయించినవాడు. వామనమూర్తికి మూడు ఆడుగుల భూమిని దానం చేసి, అతనిచేపాతాళమునకు తొక్కబడ్డాడు. కానీ ఇతని సత్య సంధితకు మెచ్చుకున్న వామనుడు గధాదారిగా ఇతని వాకిటికి కావాలి కాచేవాడు. 3.వ్యాసమహర్షి :- సత్యవతీ పరాశరుల కుమారుడు కృష్ణ ద్వాయ పాయనముని అని పిలవబడేవాడు. అష్టాదశ పురాణాలను, బ్రహ్మ సూత్రములను, భారత భాగవతములను మరియు అనేక తత్వ గ్రందములను రచించాడు. వేదాలను విడబరచిన వారు అని వ్యాసుడుని పేర్కొంటారు. **4.హనుమంతుడు** :-కేసరి భార్య అయిన అంజన పుత్రుడే హనుమంతుడు. భర్త ఆజ్ఞప్రకారం వాయు దేవుని కొలిచిన అంజనాదేవికి వాయుదేవుడు ప్రత్యక్షమై తన గర్భంలో శివుని శక్తిని ఆమెకు వరముగా ఇవ్వగా అంజనా గర్భమున హనుమంతుడు పుట్టాడు. సూర్యుని శిష్యుడు ఈరామ భక్తుడు. పరమేశ్వరుని అవతారం. రావణాది రాక్షసులను ఎదిరించి, సీత ఉనికిని తెలుసుకొని లంకేశ్వరునిహతమార్చడంలో శ్రీరామునికి ఎనలేని సేవ చేసిన మహాభక్తుడుహనుమ. మహా భారతయుద్ధంలో అర్జునిని ధ్వజమున వెలసి పాండవుల విజయానికికూడా దోహదకారి అయ్యాడు. **5.విభీషణుడు :-** కైకసికి విశ్వబ్రహ్మ కు కలిగినమూడవ కుమారుడు. బ్రహ్మపరమున ఇతడు సుశీలుడైయ్యాడు. ఈయన భార్య పరమ అనే గాంధర్వ స్త్రీ. రావణుని దుర్మార్గాలను నిర్భీతిగా విమర్శించి, సన్మార్గం గురించి చెప్పేవాడు. సముద్రము దాటుటకు , రావణుని హతమార్చుటకుశ్రీరామునికి ఉపాయం చెప్పాడు. రావణుని అనంతరం లంకాధిపతి అయ్యాడు.

**6.కృపాచార్యుడు** :-సప్త చిరంజీవులలో 6వవాడు. కృపుడు. శరద్వంతుని కుమారుడు,శరద్వంతుడు ధనుర్వేదమును పొంది తపస్సు చేసుకునేవాడు.ఇంద్రుడు ఇతని తపస్సును భగ్నం చేయుటకై ఒక అప్సరసను పంపాడు. ఆమెను చూడగానే ఇతడు కామపరవశు డై ఆచోటును వదిలి వేరే చోటుకు వెళ్ళాడు.ఆసమయమున కల్గిన కుమారుడు కృపుడు. కృపుడు శరద్వంత దగ్గర ధనుర్వేదమును నేర్చు కున్నాడు. భీష్ముని కోర్కె మన్నించి ధనుర్విద్యను నేర్పాడు. మహాభారత యుద్ధంలో దుర్యోధనుని పక్షమున నిలిచి యుద్ధం చేశాడు. యుద్ధం అనంతరం జీవించిన వీరులలో కృపుడు ఒకడు. **7.పరశురాముడు :-** రేణుకా జమదగ్నుల కుమారుడు. జమదగ్నికి తాత భృగు మహర్షి ఉపదేశంతో హిమాలయాలకు వెళ్ళి శివుని గూర్చి తపస్సు చేశాడు. ఈశ్వరుడు బోయవాని వేషమున వచ్చి పరశు రాముని పరీక్షించాడు. శివుని ఆజ్ఞతో తీర్థయాత్రలు చేశాడు. శివానుగ్రహముతో భార్గవ అస్త్రమును పొందాడు.

# భారతీయ విద్యాభవన్



## 18వ గొప్ప పుస్తక ప్రదర్శన సమాపన సమావేశం

తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 8 నంది పత్రిక భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర వారి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానమునందు 18వ గొప్ప పుస్తక ప్రదర్శనలో ఈ రోజు సమాపన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. భారతీయ విద్యాభవన్ లో ఉన్నత విద్యా ప్రమాణాలతో పాటు మానవీయ విలువలను నేర్పించడం సంతోషకరమని తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలుగా ఈ పుస్తక ప్రదర్శన నిర్వహించండం గొప్ప విషయం అన్నారు. అధ్యక్షత వహించిన తిరుపతి ఐఐటి డైరెక్టర్ ఆచార్య కె.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మానసిక వికాసం కలగగలదని,ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చు అని, పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేశారు. పుస్తక ప్రదర్శన కన్వీనర్ , భారతీయ విద్యా భవన్ గౌరవ సంచాలకులు మరియు కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పుస్తక పఠనం మానవ వికాసానికి పునాది అని,ఆలోచనాశక్తి మెరుగవుతుందని,భారతీయ సంస్కృతి ,సంప్రదాయాలను, నైతిక విలువలను భావితరాలకు అందించాలని , భారతీయ విద్యా భవన్ స్థాపనలో కీ. శే. కేఎం మున్షీ పాత్రను స్మరించుకున్నారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పుస్తకం మన నేస్తం అని, మానవ జీవితంలో పుస్తక పఠనం ఒక భాగం కావాలని,పుస్తకపఠనం వల్ల మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలియజేశారు. ముంబై భారతీయ విద్యా భవన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మాట్లాడుతూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, మానవీయ విలువలను పెంపొందించుకోవడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని తెలియజేశారు. భీమవరం భారతీయ విద్యా భవన్ చైర్మన్ విశ్వనాథ రాజు గారు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని , మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించాలని తెలియజేశారు. పెంచలయ్య మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మానసిక ఆనందం కలగ గలదని, మానవుని సర్వతోముఖాభివృద్ధికి పుస్తక పఠనం తోడ్పడగలదని



తెలిపారు. భారతీయ విద్యా భవన్ నిర్వహించిన వివిధ పోటీలలో( క్విజ్, బృంద చర్చ, ఫ్యాన్సీ డ్రెస్, బృందగానం) గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగింది. అనంతరం అతిథులను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ కమిటీ సభ్యులు, పురప్రముఖులు, సాహిత్యాభిలాషులు,ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# అనుమతులు లేని అదనపు అంతస్థు నిర్మాణాన్ని తొలగించిన ప్లానింగ్ సిబ్బంది.

## అదనపు అంతస్తుల నిర్మాణాలు చేయదలచిన వారు టిడియర్ బాండ్ల తో చేసుకోవచ్చు.





తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 8 నంది పత్రిక నగరపాలక సంస్థ పరిధిలోని ఉపాధ్యాయ నగర్ 14 వ క్రాస్ లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్థు నిర్మాణాన్ని ఆదివారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. నగరంలోని ఉపాధ్యాయ నగర్ 14 వ క్రాస్ లో నందు అనుమతులు లేకుండా ఐదవ అదనపు అంతస్థు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు పరశీలించామని డిసిపి ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేక పోవడంతో నిర్మాణాలను తొలగించామని తెలిపారు. ఎవరైనా అదనపు నిర్మాణాలను టిడియర్ బాండ్ల ద్వారా చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, టిపిఓ వంశీ, టిపిబిఓ శరన్ రాజ్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి కూటమి నేతలకు సద్బుద్ధి ప్రసాదించాలి :వైకాపా రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 8, నంది పత్రిక మాజీ సి ఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని హిందువుల నుంచి దూరం చేసే కుట్ర రాష్ట్రంలో కూటమి నేతలు చేస్తున్నారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తమ కార్యాలయంలో మాట్లాడుతూ కల్తీకే బ్రాండ్ అంబాసిడర్ ఆయన నారా చంద్రబాబు నాయుడు ముందు తమ హెరిటేజ్ లో జరుగుతున్న కల్తీ గురించి ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను డైవర్ట్ చేయడానికే లడ్డులో కల్తీ జరిగిందని హిందువులను రెచ్చగొడుతూ, హిందువుల మనోభావాలను దెబ్బతిస్తున్నారని ఆన్నారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కూటమి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకుంటునాన్నని ఆయన తెలిపారు.




# సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినా వైసీపీపై అసత్య ప్రచారాలు మానుకోలేదు

## మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెయేంద్ర రెడ్డి

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 8 నంది పత్రిక, తిరుమల లడ్డు ప్రసాదాన్ని కూడా కూటమి ప్రభుత్వ నేతలు కుటిల రాజకీయం చేస్తున్నారని, సుప్రీంకోర్ట్ క్లీన్ చిట్ ఇచ్చినా వైసీపీపై అసత్య ప్రచారాలు మానుకోలేదని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డు ప్రసాదం నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని క్లీన్ చిట్ వచ్చినప్పటికీ దీనిని రాజకీయం ఎందుకు చేస్తున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. తిరుమల లడ్డులో కల్తీ జరగలేదన్న విషయం తెలిసినప్పుడు సంతోషించాలి గానీ పనిగట్టుకుని విష ప్రచారం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మంచి బుద్ధిని ప్రసాదించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు,





డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ లు ఇప్పటికైనా తిరుమలలో ప్రసాదం విషయంలో లేనిపోని విమర్శలు చేయకుండా మానుకోవాలన్నారు. ఆళ్లగడ్డలో టీడీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుండి ఇసుక, మట్టి, చికెన్ తదితరవాటితో టీడీపీ నేతలు దోచుకుంటున్నారన్నారు. ఉయ్యాలవాడ మండలం గోవింద పల్లెలో సోలార్ యాజమాన్యంను ఎమ్మెల్యే అనుచరులమని కమిషన్ బెదిరించారని వాళ్ల పత్రికలలోనే వచ్చాయన్నారు. సోలార్ యాజమాన్యం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు తెలుపగా అక్కడినుండి ఆదేశాలు వస్తేకాని పోలీస్ యంత్రాంగంలో కదలికలు లేకపోవడం శోచనీయం అన్నారు.

వ్యవస్థలను టీడీపీ నేతలు నాశనం చేస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెపుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి ,పట్టణ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు సింగం వెంకటేశ్వర్ రెడ్డి ,యాదవాడ నరసింహారెడ్డి చింతకుంట రాజారెడ్డి, పలసాని మల్లికార్జున్ రెడ్డి ,మాదం చెన్నయ్య, పడకండ్ల భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు




# శ్రీశైల స్వామి అమ్మవార్లకు శ్రీ కాళహస్తి దేవస్థానం వారిచే పట్టువస్త్రాల సమర్పణ

**శ్రీశైలం. ఫిబ్రవరి 08. (నంది పత్రిక ):**శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి దేవస్థానం వారు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరుపున ఆ దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు సాయిప్రసాద్, కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమములో శ్రీకాళహస్తీశ్వరస్వామివార్ల దేవస్థానం ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్, పర్యవేక్షకులు నాగభూషణం, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమర్పణ కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు, వేదపండితులు, శ్రీ కాళహస్తి దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు మరియు వైదిక సిబ్బంది మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి వస్త్ర సమర్పణ చేయడం జరిగింది.




# బిసి శక్తులంతా ఏకం కావాలి

## - 22న విజయవాడ నందు బిసి సింహగర్జన



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 08. (నంది పత్రిక ):**బిసి శక్తులంతా ఏకం కావాలని, 22న విజయవాడ నందు నిర్వహించే బిసి సింహగర్జనను జయప్రదం చేయాలని బిసి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం నూనెపల్లి వద్ద ఉన్న బిఎస్పీ కార్యాలయంలో ఆదివారం బీసీవై పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ నందు నిర్వహించే బిసి సింహగర్జన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భారత చైతన్య యువజన పార్టీ పిఎసి మెంబెర్ పాల రమేష్, నంద్యాల, కర్నూలు జిల్లాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బండారు నాగేశ్వరరావు యాదవ్, కంది వరుణ్ యాదవ్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి హక్కులు కాపాడుకోవడానికి ప్రతి బీసీ బహుజనులు ఐక్యత కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. బిసిలు విడివిడిగా ఉండకుండా, బీసీ సంస్థలు, బీసీ సంఘాలు, బీసీ శక్తులు, వ్యక్తులు ఐక్య సంఘటనగా ఏర్పడవలసిన అవసరం ఉందని, ఐక్య సంఘటనగా ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. బీసీ రాజ్యం సాధించేంతవరకు బీసీల ఐక్యత, ఐక్య సంఘటనలు కలిసి పని చేయాలని, మనం ఐక్యశీగా కలిసి మెలిసి పనిచేస్తేనే బీసి రాజ్యం సాధించుకోగలమన్నారు. చంద్రబాబు ఎన్నికల మానిఫెస్టోలో 50 ఏళ్ల బిసి లకు పింఛన్ ఇస్తామని, బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు, కులగణన చేస్తామని, బిసి రక్షణ చట్టం తెస్తామని, విద్య, ఉద్యోగం, చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని హామీ ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. అమరావతి నందు కంపెనీలకిచ్చిన విధంగా బిసి లకు వెయ్యి ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేది బిసివై పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే సింహ గర్జనసభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా బీసీలు, బడుగు, బలహీన వర్గాలు తరలి వచ్చి రామచంద్రయాదవ్ కు సంపూర్ణ మద్ధతు తెలపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘము రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, బిసి సంఘము జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కడియం సాంబశివుడు, సోషల్ మీడియా కుమ్మరి గిరిబాబు, నారాయణస్వామి పాల్గొన్నారు.

# పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం.

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 8, ( నంది పత్రిక):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న ములుగు పట్టణంలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# అందమైన సూర్యాస్తమయం




**కొత్తపల్లి - నంది పత్రిక :** ఉదయకాల సూర్యోదయము ఎంత కనువిందు చేస్తుందో సూర్యాస్తమయం కూడా అంతే అందంగా చూపరులకు కనువిందు చేస్తుంది. ఆదివారం సూర్యాస్తమయం సమయంలో మండలంలోని సప్త నది సంగమేశ్వరం వద్ద సూర్యాస్తమయం సందర్శకులకు కనువిందు చేసింది. సాయంత్రం సమయంలో సూర్యుడే నీటిలో అస్తమయం అవుతున్నాడా అన్న చందంగా కనపడింది. సూర్యుడు బంగారు వర్ణంలోకి మారి అస్తమయం అవుతున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సప్త నది జలాలలో ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ సాయం సంధ్యా వందనం సూర్యార్ఘ్యములు వంటి పూజలు చేశారు.

# బద్వేల్లో వైన్ షాప్ వద్ద ఘర్షణ..

## ఇద్దరికి గాయాలు



**బద్వేల్, ఫిబ్రవరి 8( నంది పత్రిక ):**బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న కార్తీక్ వైన్ షాప్ వద్ద మద్యం విక్రయాన్ని సంబంధించి ఘర్షణ చోటుచేసుకుంది. షాపు యజమాని విష్ణువర్ధన్ రెడ్డి మరియు రామిరెడ్డి అనే వ్యక్తి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది. తనపై షాపు యజమాని దాడి చేశాడంటూ రామిరెడ్డి ఆరోపిస్తూ, తన బంధువులతో కలిసి పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద విష్ణువర్ధన్ రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొని, ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బాలసదనంలో అనాథ విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 8 నంది పత్రిక** ఆవోపా మహిళా విభాగ్ వారి సేవా నిధి కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు పట్టణంలోని చింతకుంట్ల సమీపంలోని బాలసదనం నందు లక్ష్మీ యశోదా దేవి జన్మదినం పురస్కరించుకొని బాల సదనంలోనున్న విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పాదరక్షలు వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగ్ లలితా, సునంద, ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఆవోపా మహిళ విభాగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమం మహోత్రమైనవని సేవా కార్యక్రమంలో ముందుంది అన్నారు. పువ్వాడ లక్ష్మీ యశోద సురేంద్ర కుమార్ దంపతులు బాలసదనం విద్యార్థులకు పాదరక్షలు బాటిల్స్ వాటర్ ట్యాంకులు ఇవ్వడం మంచి పరిణామం అని వారన్నారు ఈ సందర్భంగా దాతలను అభినందించారు. తన పుట్టినరోజు బాల సదన్ ఆశ్రమంలో పేద విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని తాత పువ్వాడ లక్ష్మీ యశోద అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గోవిందరాజులు పాల్గొన్నారు.

# యువతను వంచించిన కాంగ్రెస్‌ను నిలదీయండి..



## జిల్లా సాధకుడు ముంజల బిక్షపతిని భారీ మెజారిటీతో గెలిపించండి.

## ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పిలుపు


**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 8( నంది పత్రిక )** ములుగు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగుతోంది. జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు, నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి గారితో కలిసి వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ.. ములుగు జిల్లా సాధన ఉద్యమకారుడు, ములుగు జిల్లా కోసం అలుపెరగని పోరాటం చేసిన జిల్లా సాధకుడు ముంజల బిక్షపతి ని మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలి" అని పిలుపునిచ్చారు. యువతకు నిరుద్యోగ భృతి దగా: "ఎన్నికల ముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, నేడు నిరుద్యోగులను నట్టేట ముంచింది. ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను యువత నిలదీయాలి. 'మా నిరుద్యోగ భృతి ఏది? మా ఉద్యోగాల సంగతి ఏమైంది?' అని సూటిగా ప్రశ్నించాలి. కేసీఆర్ గారి అభివృద్ధి - మెడికల్ కాలేజ్: "ములుగును జిల్లాగా ప్రకటించి, మెడికల్ కాలేజీని మంజూరు చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభించింది కేసీఆర్ గారే. ములుగును మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి బాట పట్టించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిది. "అధికారం కోసం ప్రజలకు 420 హామీలు ఇచ్చి, నేడు ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను వంచించిన ఈ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో 420 వాళ్లకు బుద్ధి చెప్పాలి.

**బిక్షపతి కి మద్దతుగా లక్ష్మణ్ బాబు ప్రచారం** ములగు జిల్లా సాధనలో ముందుండి పోరాడిన ముంజల బిక్షపతి లాంటి ఉద్యమకారులు మనకు కావాలి. ఆయన గెలుపు ములుగు అభివృద్ధికి గెలుపు. కాబట్టి ఓటర్లందరూ ఆలోచించి, యువత అండగా ఉండి బిఆర్ఎస్ పార్టీకి, కారు గుర్తుకు ఓటు వేసి ముంజల బిక్షపతి గారిని భారీ మెజారిటీతో గెలిపించాలి" అని లక్ష్మణ్ బాబు గారు ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వెల్ బేబీ షోలో ... కర్నూలు చిన్నారి జైన్ అష్రఫ్ కి మొదటి బహుమతి






**హైదరాబాద్ . నంది పత్రిక .ఫిబ్రవరి 08:**హైదరాబాదులో 85వ అల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో జరిగిన వెల్ బేబీ షోలో కర్నూలుకు చెందిన చిన్నారి సయ్యద్ జైన్ అష్రఫ్ మొదటి బహుమతి సాధించి విశేషంగా ఆకట్టుకున్నాడు. కర్నూలు, అనంతపురం జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా పని చేసిన ఖాజా మొహిద్దిన్ కుమారుడు డాక్టర్.జావేద్ అష్రాఫ్, డాక్టర్. షాహిరా దంపతుల కుమారుడు సయ్యద్ జైన్ అష్రాఫ్ వెల్ బేబీ షోలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఆదివారం సాయంత్రం హైదరాబాదు నగరంలోని నాంపల్లి లో 85వ అల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్- 2026 లో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా యశోద హాస్పిటల్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన వెల్ బేబీ షోలో 15 నెలల సయ్యద్ జైన్ అష్రఫ్ మొదటి బహుమతి గెలుచుకున్నాడు. ఇక్కడే గత ఏడాది జరిగిన 100 రోజుల పిల్లలకు నిర్వహించిన వెల్ బేబీ షో లో కూడా జైన్ అష్రఫ్ మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. మొదటి బహుమతి సాధించడం పట్ల అష్రాఫ్ తాత ఖాజా మొహిద్దిన్, తల్లిదండ్రులు డాక్టర్.జావేద్ అష్రాఫ్, డాక్టర్. షహిరా, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.




# తెలంగాణ మాండలికంతో, చేనేత నేపథ్యంలో పోరంకి నవల 'ముత్యాల పందిరి'

"అ న్నీ నేనే మొదట రాశాను" అని చెప్పుకోవడం దాశరథి రంగాచార్యకు అలవాటు. 'చిల్లర దేవుళ్ళు' నవలతో తొలి తెలంగాణ మాండలిక నవల రాసింది కూడా తానేనని ఆయన ఇంటర్వ్యూలలో, సభలలో బాహాటంగా చెప్పుకున్నారు. చదివే ఓపిక, పరిశోధించే తీరిక లేని విమర్శకులు రంగాచార్య మాటలనే వేదవాక్కుగా భావించి దాన్ని బలపరుస్తూ వ్యాసాలు రాసేశారు. దాశరథి రంగాచార్య కంటే ముందు, అనగా 1964 లోనే పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' పేరిట తెలంగాణ మాండలికంలో నవల రాయడం, అదే సంవత్సరం ఆంధ్రప్రభ ఉగాది నవలల పోటీలో అది మూడవ బహుమతి పొందడం జరిగింది. ఆంధ్రప్రభలో 1964లో సీరియల్‌గా వచ్చిన ఈ నవల, 1968లో ఎమెస్కో పాకెట్ బుక్‌గా వచ్చింది. రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' కూడా 1970లో ఎమెస్కో పాకెట్ బుక్స్ లోనే వచ్చింది. తర్వాత జరిగిన పరిశోధనలలో, 1955లోనే లోక మలహరి రాసిన 'జెగ్గని యిద్దె' అనే నవల తెలంగాణ మాండలికంలో వచ్చిందని తేలింది. కాబట్టి తెలంగాణ మాండలికంతో వచ్చిన నవలల్లో రెండవ నవల 'ముత్యాల పందిరి' కాగా, మూడవది మాత్రమే దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు'. ఆ తర్వాత మాదిరెడ్డి సులోచన 'తరం మారింది' నవల వచ్చింది. మాండలిక వృత్తి పదకోశాల నిర్మాణంలో భాగంగా క్షేత్ర పర్యటన చేసి, మాండలిక పదాలను సేకరించిన పరిశోధకుడిగా పోరంకి దక్షిణామూర్తి మాండలికాల మీద విపరీతమైన ఆసక్తిని పెంచుకున్నారు. దాంతో వివిధ మాండలికాల మీద నవలలు రాయాలని సంకల్పించి ముందుగా తెలంగాణ మాండలికంలో 'ముత్యాల పందిరి', తర్వాత కోస్తా మాండలికంలో 'వెలుగు వెన్నెల గోదారి', రాయలసీమ మాండలికంలో 'రంగవల్లి' నవలలు రాసి రికార్డు సృష్టించారు. సృజనాత్మక రచయితగా, క్షేత్ర పర్యటనలతో చేనేత పని వారి జీవన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం వల్ల, అదే నేపథ్యంగా తీసుకుని 'ముత్యాల పందిరి' నవలను రూపొందించారు. ఇందులో చేనేత పని వారి కుటుంబంలో జన్మించిన చంద్రయ్యకు నేత పని ఇష్టం లేక, చదువుకోవడానికి బడికి వెళుతుంటాడు. ధనవంతుడైన మేనమామ లచ్మయ్య కూతురు ముత్యాలుతో ఆటపాటలతో అన్యోన్యంగా మెసలుతాడు. దరిద్రులన్న ఈసడింపుతో లచ్మయ్య మేనరికం పట్ల ఆసక్తి చూపడు. ముత్యాలు పుట్టినరోజుకు తండ్రి కొత్తగా చేయించిన ఉంగరాన్ని చూసి ముచ్చటపడిన చంద్రయ్య తన వేలికి పెట్టుకుని పోగొట్టుకుంటాడు. తండ్రికి, మేనమామకు భయపడి ఇల్లు వదిలి పారిపోతాడు. కొత్త ఊర్లో చేరదీసిన సాలోండ్ల ఇంట్ల పెరుగుతూ నేత పని నేర్చుకుంటాడు. చంద్రయ్య వెళ్ళిపోయిన చాన్నాళ్ళకి బతుకమ్మ పండుగ సందర్భంగా నీళ్లకుంటలో ముత్యాలుకు ఉంగరం దొరుకుతుంది. చంద్రయ్య నిర్దోషి అని తేల్చుకుంటుంది. ముత్యాలు తండ్రి లచ్మయ్య మరో మోసగాడైన రాములుతో కలిసి ఊర్లో సహకార సంఘం పెట్టి అందర్నీ మోసం చేసి బోలెడు డబ్బు గడిస్తాడు. కొడుకు మీది బెంగతో వృద్ధాప్యంతో చంద్రయ్య తండ్రి చనిపోతాడు.





తల్లిదండ్రులు జ్ఞాపకం వచ్చి చంద్రయ్య, పెంచిన వాళ్లకు చెప్పి వాళ్ళ సహాయంతో ఇంటికి చేరుకొని తల్లిని ఆదుకుంటాడు. ముత్యాలు, చంద్రయ్య మనసులు కలుస్తాయి. ముత్యాలు పట్ల తన ప్రేమకు గుర్తుగా చంద్రయ్య అపురూపమైన 'ముత్యాల పందిరి' చీర నేయడానికి పూనుకుంటాడు. అంతలో ముత్యాలుకు రాములుతో పెళ్లి చేసేస్తాడు ఆమె తండ్రి లచ్మయ్య. లంబాడి లచ్మి వల్ల రాములు దుర్మార్గుడని, వాడు అమ్మాయిలను పెళ్లి చేసుకొని అమ్మి వేస్తాడని తెలుసుకున్న చంద్రయ్య, పెళ్లికూతురుతో వెళుతున్న రాములను అదే రైలు ఎక్కి వెంబడిస్తాడు. రాములు పారిపోగా, ముత్యాలును ఓదార్చి 'ముత్యాల పందిరి' చీర కప్పి తన సొంతం చేసుకుంటాడు. ఇందులో చంద్రయ్య తల్లిదండ్రులు స్వతంత్రంగా మగ్గం పని చేసుకుంటూ ఉంటారు. కానీ మేనమామ లచ్మయ్య పేద నేతకారులు నేసిన వస్త్రాలని వ్యాపారస్తులకు అమ్మి బాగా కమిషన్ సంపాదించి గొప్పవాడు అవుతాడు. లచ్మయ్యను వ్యతిరేకిస్తూ ఊళ్లో నేత పనివారు ఒక సంఘం పెట్టి చంద్రయ్య తండ్రిని దానికి అధ్యక్షుడిగా చేస్తే, బావ అని కూడా చూడకుండా లచ్మయ్య, అతని మీదనే అభాండాలు సృష్టించి సంఘాన్ని విచ్ఛిన్నం చేస్తాడు. ఆ బాధతోనే చంద్రయ్య తండ్రి ప్రాణాలు వదులుతాడు. కులవృత్తులు చేసుకునే వారిలోనే కొందరు దళారులు ఏర్పడి మిగిలిన వారిని దోపిడీ చేయడమనేది వర్గ సమాజంలో ఒక సహజమైన పరిణామం అని లచ్మయ్య పాత్ర ద్వారా రచయిత నిరూపించారు. లచ్మయ్య కూలి సరిగా ఇవ్వక పనివాళ్ళను వేధిస్తూ ఉంటాడు. కూలి గురించి ఒక నేత పనిమనిషి ఇలా అంటాడు. "లచ్మయ్య పెంచుతాడా? ఆయన ఎంత అంటే అంతనే. ఎక్కువ గావాల్నంటే పనులకెళ్ళి తీపిస్తాడు. నువ్వు కాకుంటే నీ యసుంటోండ్లు, మంది లెస్సగున్నరులే పొమ్మంటాడు. ఏమి సెయ్యాలె. సచ్చి సచ్చి సేస్తనే ఉంటాం. ఇయ్యాలరేపు పైస గలోనిదే రాజ్యం. కష్టమొకనిది, లాభమొకనిది. గా పనులన్నీ లచ్మయ్య పేటల, పట్నంల పైసకు పైస లెక్కన లాభం చూసుకొని అమ్ముకుంటాడు." ఈ ప్రధాన ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని చేనేత వృత్తి పనివారి గురించి, వాళ్ల జీవన విధానాన్ని గురించి వివరంగా తెలియజేయడంలో రచయిత సఫలమయ్యారు. నేతపని తీరొక్క రీతులు, సాలోళ్ళలో రకాలు, నెంబర్‌ను బట్టి దారం తెలుసుకోవడం, కండెలు పట్టడం అన్నింటి గురించి సందర్భోచితంగా తెలియజేశారు. హోలీ, బతుకమ్మ పండుగలతో పాటు, చంద్రయ్య పెరిగిన ఇంట్లో అక్కగా ఉన్న పున్నమ్మ పెండ్లి సందర్భంగా సాంస్కృతికపరమైన విషయాలనెన్నింటినో వివరంగా తెలియజేశారు. సాలె వాళ్ల గురించి, వారి ఆశ్రిత కులాల గురించి వివరించారు. మధ్యలో లంబాడీల ప్రస్తావన వస్తే వాళ్ల పేర్లు, వాళ్ళ ఇంటి పేర్లు, వారు ధరించే నగల వివరాలను ఇచ్చారు. "తరీక, సాల్లె, థోడం దినాల, శనారం, పొద్దుమీకి, పోరలు, ఎక్క, అంబటాల, పెయ్యి" లాంటి ఎన్నో మాండలిక పదాలను పొదుపుకున్న ఈ నవలలో సంభాషణలే కాకుండా కథాకథనాలను కూడా తెలంగాణ మాండలికంలో రాసి పాఠకులను ఆకట్టుకోగలిగారు. దీన్ని ఒక వైపు తెలంగాణ మాండలిక నవలగా, మరోవైపు పద్మశాలి జీవన చిత్రణల నవలగా కూడా చెప్పుకోవచ్చు.

# పల్లె కథా భారతి

గడిచిన ఆరేడేళ్ల కాలంలో కథా ప్రక్రియకు సంబంధించి తెలుగు సాహిత్య యువనికపై ఎండపల్లి భారతి అనే వేగుచుక్క పొడిచింది. 2018లో 'ఎదారి బతుకులు' పేరిట 30 కథల సంపుటి, 2021లో 'బతుకీత' పేరుతో 20 కథల సంపుటి, 2023లో 'జాలారి పూలు' పేరిట మరో 20 కథల సంపుటి గాక, అదే ఏడాది 'జక్కీకు' నవల, గత ఏడాది 'దేవరహస్యాలు' కథా సంపుటి వెలువరించి కథా స్రవంతితో అలజడి సృష్టించింది. ఎలిమెంటరీ స్కూలు దాటని ఒక పల్లెపడుచు, అందులోనూ మాదిగపల్లె ఆడపిల్ల, పన్నెండేళ్లకే పెళ్ళై సంసార సాగరంలో నెట్టబడ్డ ఒక వెనుకబాటుకు గురైన ప్రాంతపు ఆడపిల్ల,



ఇంత తక్కువకాలంలో ఇన్ని కథలు రాయటమే కాదు 40 వేల కాపీలు అమ్ముడయ్యే 'నవోదయం' పత్రిక సంపాదకవర్గ సభ్యురాలిగా ఉంది, ఒక సినిమాతోపాటు, మరికొన్ని లఘు చిత్రాలు నిర్మించిందంటే నమ్మలేం. కాని అది నిజం. గతంలో నామిని 'మిట్టూరోడి' భాషను చూసి చిత్తూరు జిల్లా భాషలో ఇంత మాధుర్యముందా! అనుకొని చిత్తయిన పాఠకులు ఎండపల్లి భారతి మదనపల్లె ప్రాంతపు (దిగువ బురుజు) మాండలికానికి అబ్బురపడ్డారు, ఆస్వాదించారు. భారతి కథల్లో తాత్వికత, కథనంలో కళాత్మకత, జీవం, జనజీవిత విస్తృతి ఉన్నాయి. బూతు మాటలు, సామెతలు కథలో అలవోకగా ఇమిడిపోవటమేగాక అశ్లీలత ఛాయలు ఎక్కడా కనపడవు. కులవివక్ష, లింగవివక్ష అత్యంత సహజంగా చూపటంలో భారతి కథన కౌశలం అపూర్వం. గ్రామీణ జీవితంతో సంబంధం ఉన్న పాఠకులకు మన పక్కన రోజూ జరిగిన విషయమంత సహజంగా, పల్లె జీవితంతో సంబంధంలేని పట్టణ వాసులకు అబ్బురంగా అన్పించే కథలు ఇవి. 'ఎదారి బతుకులు' పుస్తకానికి ముందుమాటలో ఇండస్ మార్టిన్ అన్నట్లు, "ఈ భూ ప్రపంచకం మొత్తం మీద ఏ మూలకి వెళ్లినా ఆడోళ్లు దిగనాసితనంలోకి తోసెయ్యబడ్డాళ్లే. ఈ దేశపు ఆడోళ్లు మరికాస్త ఎక్కువ తోసెయ్యబడ్డవాళ్లే. ఇందులో మళ్లీ మా దళితగూడెం ఆడోళ్లు బయట సమాజంలో కులం పేరుతో, ఇంట్లో మొగాళ్ల చేతుల్లో ఆడంగితనం పేరుతో, మిగతా కులాల ఆడోళ్ల మజ్జనేమో కులంతోపాటు బీదరికాన్నిబట్టీ మొత్తంగా ఈసడించుకోబడుతున్నారు.... మా గూడెపు మొగోడు తనతోపాటు సమానంగా బువ్వ సంపాదిచ్చే, తనకన్నా ఎక్కువగానే గుడిసెను భద్రం చేసుకునే దళిత స్త్రీలపట్ల చూపించే 'మగతనం' భారతి కథల్లో మిగతా స్త్రీవాద సాహిత్యంలోని నిందా దృక్పథంతో కాకుండా నిస్సహాయత వ్యక్తం చేస్తూ వివక్షను ఎత్తిచూపుతుంది". ఏ ప్రక్రియలో అయినా క్లుప్తత సుందరంగా ఉంటుంది. రాయటంలోనూ, మాట్లాడటంలోనూ "తక్కువ" చాలా ఎక్కువమందిచే ఆకర్షింపబడుతుంది. భారతి రాసిన కథల్లో నేను చదివిన 72 కథల్లో ఒక్క 'మా ఇంటికొచ్చిన నల్లపెట్ట' అనే కథ మాత్రమే ప్రింటులో 17 పేజీలుంది. మిగిలిన 71 కథలూ నాలుగైదు పేజీలే. భారతి కథల్లో కన్పించే ఈ క్లుప్తసుందరత కూడా పాఠకుల్ని ఆకర్షించటానికి ఒక కారణం కావచ్చు. టమాటా (అవగూద కాయలు) పంట పేరిట జూదం, పురుగు మందు పేరిట భూమితల్లి కడుపు విషంతో నింపటం, దుడ్లుపెట్టి నీళ్లు కొనే కాలంలో చొమ్ము (చెంబు) నీళ్లు పుట్టని వైనం, నీళ్ల కడవెత్తమంటే అంతలావు మొగున్ని మోస్తారు గాని నీళ్ల కడవ మొయ్యలేరా అని చెతురాడే ఆడాళ్లు, ఇత్తడి బిందె కొన్న మల్లమ్మని చూసి "మా తాగుబోతు నాబట్ట ఎంత నోరుకొట్టుకొని చెప్పినా పైసా మిగిలిస్తే కదా కూలి దుడ్లంతా నా సాదు తాగేదానికే సరిపోతుండే" అని బాధపడే ఇల్లాలు, "నేనూ నా బిడ్డా కడుపు కట్టుకుని కూడేసిన దుడ్లతో తెచ్చిన ఇత్తలి బిందె నక్కా ముక్కాట కోసం నీ ఎదాన పెట్టుకుంటివే" అని వాపోయిన మల్లమ్మ, కసువుకి పోయి రెడ్డికి చిక్కి "ఓయప్పా నేను ఈ పొద్దే బయట ఉన్నాను. నా దగ్గరకొచ్చి ఏమన్నా అయితే చెడ్డపేరు. మూడుదినాలైనాక ఈటికే వస్తా నీ పని గడపతానని" తప్పించుకున్న ఆడది, సావు గుంత కాడ దానమిచ్చిన వడ్లను తెచ్చి సంకట చేసి తిన్నంక సావు బియ్యం తినకూడదని ఆనెంక తెల్సుకున్న ఆమెకి "సావు బియ్యమూ బతుకు బియ్యమూ అని వుండవు. కాలే కడుపును సల్లార్చే బియ్యమే వుంది" అని ఓదార్చిన బోయ కొండవ్వ... ఇలా పల్లెలో ప్రతి మనిషీ, పల్లె చుట్టూ జరిగే ప్రతి ఘటనా భారతి కథల్లో కదురుకున్నాయి. ఈ కథల కాలంలో వచ్చిన కరోనా, పెద్దనోట్ల రద్దు కూడా కథలుగా మారాయి. సమస్త పల్లె జీవితాల్ని సవిస్తారంగా కథల రూపంలో మన ముందు పరిచింది ఎండపల్లి భారతి. ప్రచారం వలనో, మార్కెట్ మాయాజాలం వలనో, ఇతరేతర కారణాల వలనో లక్షల పుస్తకాలు అమ్ముడుపోవచ్చు. కాని అవి పాఠకుల మన్నన పొందిన దాఖలాలు లేవు. యాదృచ్ఛికంగా భారతి ఒక్క కథను చదివినా మిగిలిన కథల్ని ఆ కథే చదివిస్తుంది. మిగిలిన పుస్తకాల్ని కొనిపిస్తుంది. సాహిత్య ప్రక్రియల్లో కథ, కవిత్వం పాఠకుల్ని కోల్పోతున్న వర్తమాన కథా స్రవంతిలో ఇలా చదివించిన రచయిత్రి భారతే!

# అప్పన్న.. సుబ్బన్న ఒక్కటేననా!

వైసీపీ ఎంపీ, గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డికి కడూరు చిన్నప్పన్న పీఏ మాత్రమే కాదు. అంతకుమించి వీరి మధ్య విడదీయరాని బంధం ఉంది. ఎంపీగా వైవీ త న లెటర్‌హెడ్‌పై చిన్నప్పన్న ఫోన్ నంబర్ (9542419999) వేయించారు. వైవీ పీఏ హోదాలో చిన్నప్పన్న ఈ ఫోన్ నంబర్ ద్వారానే టీటీడీలో నెయ్యి టెండర్ల వ్యవహారంలో 'సంప్రదింపులు' జరిపారు. పలు కంపెనీల నుంచి కోట్లాది రూపాయల ముడుపులు వసూలు చేశారు. సిట్ లెక్క ప్రకారం చిన్నప్పన్న ఖాతాలో రూ.4.6 కోట్లు పడ్డాయి. గత జగన్ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. 2019 అక్టోబరు 10 నుంచి 2024 జూన్ 1 వరకు ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రత్యేక లైజనింగ్ అధికారిగా చిన్నప్పన్న పనిచేశారు. 2019 తర్వాత చిన్నప్పన్నతో తనకు సంబంధం లేదని సుబ్బారెడ్డి చెబుతున్నారు. కానీ ఈ మాట పూర్తిగా అవాస్తవం. టీటీడీ చైర్మన్‌గా వైవీ నియమితులైనప్పటి నుంచి చిన్నప్పన్న పీఏగానే వ్యవహరించారని సిట్ తుది చార్జిషీట్‌లో స్పష్టం చేసినట్లు తెలిసింది. చిన్నప్పన్న పేరుకే ఏపీ భవన్ అధికారి అయినా పనిచేసినదంతా టీటీడీలోనే. టీటీడీలో వందల కోట్ల విలువైన నెయ్యి సరఫరా టెండర్లు ఎవరికి దక్కాలో చిన్నప్పన్న డిసైడ్ చేశారని సిట్ తేల్చింది. అందుకు ప్రతిఫలంగా ముడుపులు అందాయి. పెద్దల అండదండలు లేకుండా ఏపీ భవన్‌లో లైజనింగ్ అధికారి హోదాలో ఆయన ఈ దందా చేయగలరా? ఇదే మిస్టరీ? వైవీకి పీఏగా చిన్నప్పన్న పనిచేశారని పేర్కొన్న సిట్.. ఈ 'వ్యవహారం'లో చిన్నప్పన్నను పీఏగా వాడుకున్న వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఏమిటో ఎందుకు తేల్చలేకపోయింది?

కడూరు చిన్నప్పన్న.. 2019-2024 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో చక్రం తిప్పిన పెద్ద మనిషి. ఎక్కడో ఢిల్లీలో ఏపీ భవన్ స్పెషల్ లైజనింగ్ ఆఫీసర్ పోస్టులో ఉంటూ టీటీడీలో వ్యవహారాలను శాసించారు. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన కంపెనీల నుంచి ముక్కుపిండి కమీషన్లు వసూలు చేశారు. అటు ఢిల్లీలో ఎంపీల నివాసాల్లో, ఇటు టీటీడీ పరిధిలో కీలక భేటీలు జరిపి అంతా తానై వ్యవహారాలు చక్కదిద్దారు. ఏపీ భవన్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా ఉన్న చిన్నప్పన్నకు ఇదెలా సాధ్యపడింది? టీటీడీకి, ఆయనకు అసలు సంబంధం ఏంటి? టీటీడీలో ఆయన మాట ఎలా చెల్లుబాటైంది. చిన్నప్పన్న తన పీఏ కాదని సుబ్బారెడ్డి చెబుతున్నారు. కానీ ఆయన టీటీడీ చైర్మన్‌గా పని చేసినంతకాలం చిన్నప్పన్న పీఏగానే పనిచేశారని సీబీఐ సిట్ చెబుతోంది. వైవీ మాటలు వట్టి మాటలేనని నిర్ధారించే ఆధారాలు బయటకొచ్చాయి. చిన్నప్పన్న, సుబ్బన్న ఇద్దరూ ఒకటే అని తేలిపోయింది.

**వైవీ లెటర్‌హెడ్‌పై చిన్నప్పన్న నంబర్** వైవీ ఎంపీగా తన లెటర్‌హెడ్‌పై ఒంగోలు ఆఫీసు అడ్రస్ ఇచ్చారు. కమ్యూనికేషన్ కోసం రెండు ఫోన్ నంబర్లు ఇవ్వగా, అందులో ఒక నంబర్ 9542419999. ఈ నంబరు చిన్నప్పన్నదే. 2019 తర్వాత కూడా అదే కమ్యూనికేషన్ కొనసాగింది. ఇదే నంబర్‌ను చిన్నప్పన్న ఉపయోగించి టీటీడీలో టెండర్లు వేసిన కంపెనీలు, సంస్థలతో సంప్రదింపులు, లావాదేవీలు జరిపారు. తిరుమలకు నెయ్యి(కల్తీ) టెండర్ల బాగోతంలో ఢిల్లీ, తిరుపతి, విజయవాడ వేదికగా ఆయన అనేక సమావేశాలు నిర్వహించారు. పలు కంపెనీల నుంచి అటు ఢిల్లీలో, ఇటు తిరుపతి వేదికగా కోట్ల రూపాయల ముడుపులు వసూలు చేశారు. సిట్ లెక్క ప్రకారం 4.6 కోట్ల రూపాయలు చిన్నప్పన్న ఖాతాలో పడ్డాయి. 2019 సెప్టెంబరు వరకే చిన్నప్పన్న తనతో పనిచేశారని, తర్వాత ఆయన ఢిల్లీ ఏపీభవన్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేశారని, ఆయనతో తనకు ఏ సంబంధం లేదని వైవీ చెబుతున్నారు. అదే నిజమైతే.. 2019 అక్టోబరు నుంచి టీటీడీ వ్యవహారాల్లో చిన్నప్పన్న ఎందుకు వేలుపెట్టారు? చిన్నప్పన్న వైవీ పీఏగానే అందరికీ పరిచయయ్యారు. టీటీడీలోని నాటి కీలక అధికారులు, చివరకు కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ సహా ఇతర ఉన్నతాధికారులు, నిపుణులు చిన్నప్పన్న ఫోన్ నంబర్‌ను వైవీ పీఏగానే నమోదు చేసుకున్నారు. సీబీఐ సిట్ కూడా ఇదే విషయాన్ని నిర్ధారించినట్లు తెలిసింది.

**అజేయ కల్లంరెడ్డి సిఫారసు** గత జగన్ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి పనిచేశారు. టీటీడీలో ఎలాగూ తనకు పీఏ, పీఎస్, ఇతర అధికారులు ఉంటారు కాబట్టి చిన్నప్పన్నను ఢిల్లీలో ఉంచి ఉపయోగించుకోవాలని వైవీ భావించినట్లుగానే పరిణామాలు జరిగాయి. అందుకే ఆయన్ను ఏపీ భవన్‌లో ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్‌గా నియమించినట్టు తెలుస్తోంది. ఇందుకు నాటి సీఎం జగన్ ముఖ్య సలహాదారు అయిన అజేయ కల్లంరెడ్డి తోడ్పాటు అందించారని స్పష్టమవుతోంది. చిన్నప్పన్నను ప్రత్యేక లైజనింగ్ అధికారిగా నియమించాలని సిఫారసు చేసింది ఆయనే. చిన్నప్పన్నను ఆ పదవిలో నియమిస్తూ గత ప్రభుత్వం 2019 అక్టోబరు 10న ఉత్తర్వులు(జీవో 2234) జారీ చేసింది. తొలుత మూడేళ్లు పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత మరో రెండేళ్లు పొడిగిస్తూ 2022లో మరో ఉత్తర్వు (జీవో 2076) జారీ చేశారు. అంటే.. 2019 అక్టోబరు 10 నుంచి 2024 జూన్ 1 వరకు చిన్నప్పన్న ప్రత్యేక లైజనింగ్ అధికారిగా పనిచేశారు.

**అసలు లైజనింగ్ ఎవరికోసం?** రెండో దఫా పోస్టింగ్‌లో కొనసాగించే సమయంలో.. 2022లో తనను ఏపీ భవన్ స్పెషల్ సెక్రటరీగా నియమించాలని చిన్నప్పన్న ప్రభుత్వాన్ని కోరారు. అది పెద్ద పోస్టు. కానీ ఆ పదవిలో నియమించలేదు. అయితే ఏపీ భవన్‌లో లైజనింగ్ చేయాల్సిన చిన్నప్పన్న ఎవరికోసం పనిచేశారన్నదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. దీనికి సరైన సమాధానం సీబీఐ సిట్ చెబుతోంది. టీటీడీ చైర్మన్‌గా సుబ్బారెడ్డి నియమితులైనప్పటి నుంచి చిన్నప్పన్న ఆయన పీఏగానే వ్యవహరించారని తన తుది చార్జిషీట్‌లో అనేక చోట్ల స్పష్టం చేసినట్లు తెలిసింది. టీటీడీ పరిధిలోని అన్ని విభాగాల్లో చిన్నప్పన్న ఫోన్ నంబరు వైవీ పీఏగానే నమోదైందని సిట్ పేర్కొన్నట్లు సమాచారం. అదే హోదాలో చిన్నప్పన్న టీటీడీలోని కీలక విభాగాధిపతులు, నిపుణులు, ఇతర పెద్దలతో సంప్రదింపులు జరిపారని, తరచూ ఫోన్‌లో మాట్లాడారని సిట్ గుర్తించినట్లు తెలిసింది. భోలే బాబా డెయిరీ టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలంటే.. తమకు కేజీకి రూ.25 చొప్పున కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది చిన్నప్పన్నే.

**ఎంత గట్టి బంధమో?** 2022లో భోలే బాబా డెయిరీ కమీషన్ ఇచ్చేందుకు నిరాకరించిన తర్వాత దానిపై టీటీడీకి అనేక ఫిర్యాదులు వచ్చాయి. అందులో ఆకాశరామన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అందులో ఒక ఫిర్యాదు నాటి చైర్మన్ సుబ్బారెడ్డికి అందింది. ఆ ఫిర్యాదు మేరకు భోలే బాబా డెయిరీలో తనిఖీలు చేసి విచారణ చేయాలని సుబ్బారెడ్డి ఆదేశించారు. ఇందులో ఒక ట్విస్ట్ ఉంది. భోలే బాబా డెయిరీపై వచ్చిన ఒక ఆకాశరామన్న ఫిర్యాదును వైవీ సుబ్బారెడ్డికి అందించింది ఎవరంటే.. చిన్నప్పన్నే. సిట్ తన నివేదికలో ఈ విషయం పేర్కొంది. ఆ ఫిర్యాదు ఆధారంగా జరిగిన తనిఖీలు, అనంతర వ్యవహారాలకు చిన్నప్పన్న దిశానిర్దేశం చేశారని సిట్ స్పష్టంగా చెబుతోంది. తాము కోరినట్లుగా కమీషన్‌లు ఇవ్వని భోలే బాబా డెయిరీని కాంట్రాక్ట్ నుంచి తప్పించాలని, ఈ దిశగానే తనిఖీ రిపోర్టులు ఉండాలని టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎంను చిన్నప్పన్న ఫోన్‌లో పదేపదే ఆదేశించారు. ఆ మేరకు జరిగిపోయింది. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆమోదం లేకుండానే ఇవన్నీ చేశారా? వైవీతో ఏ సంబంధం లేకుండా కేవలం ఏపీ భవన్ లైజనింగ్ అధికారి ఆదేశిస్తే టీటీ డీ అధికారులు నిర్ణయాలు తీసుకుంటారా?

**బేరాల తర్వాతే కాంట్రాక్టులు** నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ నుంచి భోలే బాబాను తప్పించాక కొత్తగా టెండర్లు ఏ కంపెనీతో వేయించాలన్న విషయంలో కూడా చిన్నప్పన్న పాత్ర ఉంది. పలు కంపెనీలను ఢిల్లీ ఏపీ భవన్, ఎంపీల నివాసాల వద్దకు పిలిపించి సమావేశాలు నిర్వహించారు. ఇదే కోవలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తాను పిలిచి మీటింగ్ జరిపారు. రూ.483 కోట్ల కాంట్రాక్ట్‌లో కేజీకి రూ.7 చొప్పున కమీషన్ ఇవ్వాలని బేరాలు జరిపారు. ఆ తర్వాతే ఆ కంపెనీకి కాంట్రాక్టు దక్కింది. పలు దఫాలుగా చిన్నప్పన్నకు ఆ కంపెనీ డబ్బులు ముట్టజెప్పింది.

# చేపల ధర పతనం

చేపల ధర పత నమైంది. నిన్న మొన్నటి వరకు తెల్లచేప కిలో రూ.122 ఉండగా ఒక్కసారిగా రూ.114కి పడిపోవడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. నిత్యం రూ.500 నుంచి 650 లారీల చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులయ్యేవి. ప్రస్తుతం తెల్లచేప ధర పతనం కావడంతో 250 350 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు చేప ల మేత డీవోబీ తవుడు 10 టన్నులు రూ.లక్షా 50వేలు ఉండగా ప్రస్తుతం రూ.లక్షా 80 వేలు పలుకుతోంది. లీజు ఎకరానికి రూ.లక్షకు పైగా ఉంది. ఖర్చు పెరిగి చేపల ధర పడిపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. రెండు నెలలుగా పొగమంచు కారణంగా వాతా వరణం చల్లగా ఉండడంతో మేతలు సక్రమంగా తినకపోవడం తో చేపల ఎదుగుదల లోపించింది. దీనికితోడు పెట్టు బడి వ్యయం పెరగడం, చేపల ధర తగ్గుముఖం పట డంతో నష్టాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

**గిట్టుబాటు ధర కల్పించాలి** తెల్లచేప ధర కిలో కనీసం రూ.125 ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తెల్లచేపల ఎగుమతులు సక్రమంగా జరగాలి. ఈశాన్య రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పెరిగిన చేపల మేతల ధరలను తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



## చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్

రాజకీయ, సినీ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఒకే వేడుకలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్, నటుడు-రాజకీయ నేత 'దళపతి' విజయ్ ఆదివారం చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఇద్దరు అగ్రనేతలతో కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసీపీ అధినేత జగన్ బంధువు వై.ఎస్. సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ రెడ్డి వివాహం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగన్, విజయ్ పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవలే 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, 'జన నాయగన్' అనే తన సినిమా సెన్సార్ వివాదాలతో వార్తల్లో నిలిచారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com